


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 08.10.2025 | సంపుటి : 2 | సంచిక :245 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 08.10.2025 | volume : 2 | Issue : 245 | Pages : 8 | Cost : 2/- |




## అప్పు తీసుకుని ఎగ్గొట్టిన వ్యాపారి

### ఇంటిపై దాడిచేసి తగులబెట్టిన బాధితులు

నల్గొండ,అక్టోబరు7 : నమ్మిన జనానికి మాయమాటలు చెప్పి వాళ్ల దగ్గర సొమ్ములు అడ్డంగా దోచేసి, తీరా ఇవ్వమంటే, ఏళ్లకేళ్లు తిప్పించుకుంటూ నరకయాతన గురిచేసిన ఓ మాయగాడికి అప్పిచ్చిన వాళ్లంతా కలిసి గుణపాఠం చెప్పారు. అందరి దగ్గరా

- మిగతా 2 లో..

# కాళేశ్వరం మరమ్మతులు

### ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే..

### తుమ్మడిహట్టిపై రెండు ప్రత్యామ్నాయాలు

### అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,అక్టోబరు7 :ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మరమ్మతులు చేపడతాం అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.. డిజైన్లు రూపొందించేందుకు జాతీయ నైపుణ్య సంస్థల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం అని అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో పారదర్శకంగా మరమ్మతులు చేపడతాం అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో

- మిగతా 2 లో..

## తెలుగు రాష్ట్రాల్లో ఐటీ సోదాలు

### రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు




హైదరాబాద్, అక్టోబర్ 7 : తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని 25 చోట్ల అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసులో

- మిగతా 2 లో..




## ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టులు

## రేపటి నుంచి దరఖాస్తులు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీకి ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎస్సీ అభ్యర్థులు వర్గీకరణ (గ్రేడ్ 1,2,3) ప్రకారం కొత్త ఫార్మాట్‌లో

- మిగతా 2 లో..



## కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు

- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు భారీ షాక్
- ఓటరు కార్డులు పంచడంపై కేసు నమోదు

హైదరాబాద్, అక్టోబర్ 7 : జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమో దు అయ్యింది. మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి నవీన్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి చర్యగా భావించిన ఎన్నికల సంఘం

- మిగతా 2 లో..

# బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 7 : రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. ఈ విచారణను దృష్టిలో పెట్టుకొని హైకోర్టులో వినిపించాల్సిన వాదనలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా

- మిగతా 2 లో..

### మంత్రులతో సీఎం రేవంత్ సమాలోచనలు

### అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ







## పత్తి కొనుగోళ్ల కోసం 122 సెంటర్ల ఏర్పాటు

### తెలంగాణలో 80 శాతం పత్తి కొనుగోళ్లు

### సిసిఐ ద్వారానే నేరుగా కొంటాం

### కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్

**తెలంగాణలో 80 శాతం పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణలో 20 లక్షల మంది పత్తి రైతులు ,18 లక్షల హెక్టార్లలో పత్తి పంట పండిస్తున్నారని వివరించారు.**

న్యూఢిల్లీ,అక్టోబరు7 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు సహకారం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. పత్తి రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ఒక అప్లికేషన్ ప్రారంభించిదని... రైతులు అందులో రిజిస్టర్

- మిగతా 2 లో..



## 60కోట్ల మోసం కేసులో విచారణ

### ముంబై పోలీస్ విచారణకు శిల్పాశెట్టి




## ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీ

### భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు

### పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయం

### సమన్వయంతో కలసి ముందుకు వెళ్లాలన్న పిసిసి చీఫ్

### కాంగ్రెస్ అగ్రనేతలను కలిసి ఫిర్యాదు చేస్తానన్న అడ్లూరి




# పొన్నం, అడ్లూరి మధ్య లొల్లి

హైదరాబాద్,అక్టోబర్ 7: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. మంత్రి పొన్నం వ్యాఖ్యలపై తాజాగా, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందిస్తూ.. ఓ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన పొరపాటును ఒప్పుకొని క్షమాపణ చెబితే పొన్నంకు గౌరవంగా ఉంటుందన్నారు. మాదిగలు అంటే మీకు అంత చిన్న చూపా, అని సీరియస్ అయ్యారు. అన్న మాటను సమర్థించుకుని ఇప్పటి వరకు రియాక్ట్ కాకుండా ఉన్నావంటే ఈ విషయం నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను అని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. సహచర మంత్రిని, ఎస్సీ సామాజిక వర్గం

- మిగతా 2 లో..



## ఓట్ చోరీ కంటే ఇది పెద్ద నేరం కాదా?

### కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడం ఏంటి?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడంపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఉప ఎన్నిక

- మిగతా 2 లో..

### గ్రూప్-1 నియామకాలపై స్టేకు

# సుప్రీం నిరాకరణ

### హైకోర్టు తీర్పుకు లోబడే నియామకాలు



**తెలంగాణ గ్రూప్-1 నియామకాలపై అడ్డంకులు తొలిగాయి. దీనిపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఊరట లభించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు అనుగుణంగా నియామకాలు ఉండాలని స్పష్టం చేసింది. గ్రూప్-1 నియామకాలపై ఇటీవల హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.**

న్యూఢిల్లీ,అక్టోబరు7 : హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా.. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిచడంపై స్టే ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల్య బాగ్చిల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపైనా

- మిగతా 2 లో..

# టీజీఎస్ ఆర్టీసీలో డ్రైవర్, శ్రామిక్ పోస్టులు

మొదటి పేజీ తరువాయి

కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్ మెంట్ బోర్డ్ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. కొత్త సర్టిఫికెట్ అందుబాటులో లేకపోతే..తాత్కాలికంగా పాత ధ్రువీకరణ పత్రాన్ని అప్ లోడ్ చేసి.. ధ్రువపత్రాల పరిశీలన సమయంలో మాత్రం తప్పనిసరిగా కొత్త ఫార్మాట్‌లో సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆర్టీసీలో మొత్తం భర్తీ చేయనున్న ఉద్యోగాల సంఖ్య 1,743 కాగా.. ఇందులో డ్రైవర్ కొలువులు 1,000, శ్రామిక్ పోస్టులు 743 ఉన్నాయి. అక్టోబరు 8వ తేదీ నుంచి 28 వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి www.tgprb.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల్ని ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. గతంలో ఆర్టీసీనే తమ సంస్థలో ఉద్యోగాల్ని భర్తీ చేసేది. ఈ సారి డ్రైవర్, శ్రామిక్ పోస్టుల భర్తీని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు అప్పగించారు. డ్రైవర్ పోస్టులకు 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకు.. శ్రామిక్ ఉద్యోగాలకు 18 నుంచి 30 సంవత్సరాల వరకు వయోపరిమితి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు ఐదేళ్లు.. ఎక్స్ సర్వీస్‌మెన్‌కు మూడేళ్ల వయోపరిమితి సడలింపు ఉంటుంది.

# తెలంగాణలో 80 శాతం పత్తి కొనుగోళ్లు

మొదటి పేజీ తరువాయి

చేసుకోవాలని సూచించారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో గిరిరాజ్ సింగ్ మాట్లాడారు. గతంలో పత్తిని ఎంత సేకరించామో.. ఈ ఏడాది కూడా అలానే పత్తిని సేకరిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి కొనుగోళ్ల కోసం గతేడాది 110 సెంటర్లు ఉన్నాయని.. ఇప్పుడు122 సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తనను కోరారని చెప్పుకొచ్చారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులు దుర్వినియోగం అయ్యాయని.. ఇప్పుడు కూడా దుర్వినియోగం అవుతున్నాయని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే కాదని.. రాష్ట్ర రైతాంగానికి మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం నిలవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తమ బాధ్యత నుంచి ఎందుకు తప్పుకుంటుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ఎంత పత్తి ఉత్పత్తి అయితే అంత కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. రైతులకు స్మార్ట్ ఫోన్స్ లేకుండానే నిధులు వెళ్తున్నాయా అని ప్రశ్నించారు గిరిరాజ్ సింగ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013 నుంచి 2014 వరకు రూ.12, 500 కోట్ల పత్తి కొనుగోళ్లు చేస్తే.. ప్రస్తుతం రూ.73,000 కోట్ల పత్తి కొనుగోళ్లు జరిగాయని వెల్లడించారు. రూ. 65 వేల కోట్ల పత్తి కొనుగోళ్లు కేవలం తెలంగాణ నుంచే జరిగాయని వెల్లడించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్నదాతల ఆదాయం రెట్టింపు చేసేందుకు చర్యలు చేపట్టామని ఉద్ఘాటించారు. 2014లో క్వింటా పత్తి ధర రూ.3,700లు ఉంటే.. ఇప్పుడు క్వింటా రూ.7,710ల ధర ఉందని నొక్కిచెప్పారు. మరో గ్రేడ్ రకం గతంలో క్వింటా రూ. 4 వేలు ఉంటే.. ప్రస్తుతం క్వింటా రూ. 8,110లుగా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు మద్దతుగా నిలవాలని సూచించారు. పత్తిలో తేమ శాతాన్ని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో ఓ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు మద్దతుగా నిలవాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం క్వాలిటీ సీడ్స్ ఇవ్వాలని గిరిరాజ్ సింగ్ సూచించారు.

# ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారమే కాళేశ్వరం మరమ్మతులు

మొదటి పేజీ తరువాయి

ఉందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మిడిహట్టి విషయంలో రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కాలువల విషయంలో ఈనెల 22 లోపు నిర్ణయం తీసుకుంటామన్నారు. మైలారం ద్వారా సుందిళ్లకు ఒక కాలువ ప్రతిపాదన, నేరుగా ఎల్లంపల్లికి నీటి తరలింపు ఇంకో ప్రతిపాదన ఉంది. వ్యయం, హైడ్రాలిక్, ఇంధనం, అన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. రెండు ప్రతిపాదనలపై ఇంజినీర్లు 2 వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కోరాం. 2027 డిసెంబర్ నాటికి ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి చేయాలన్నది మా లక్ష్యం. వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. డిండి ఎత్తిపోతలపై అధికారులు 3 రోజుల్లోగా నివేదిక అందించాలి' అని ఉత్తమ్ అన్నారు.

# పత్తి రైతులకు అండగా ఉంటాం

- సిసిఐకి మాత్రమే పంటలను అమ్ముకోవాలి
- కేంద్రమంత్రి గిరిరాజ్‌తో కిషన్ రెడ్డి చర్చలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 :** పత్తి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి భరోసా కల్పించారు. అన్నదాతలు తక్కువ ధరకు పత్తిని బయట అమ్మవద్దని.. ఆలస్యమైన సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పత్తి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి పంటని అమ్మాలని సూచించారు. 12 శాతం కంటే తక్కువ తేమ ఉన్న కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. పంటని అమ్మడానికి 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉంటాయని.. ఎవరైనా రైతులను మోసం చేస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తరపున రైతులకు అండగా ఉంటామని మాటిచ్చారు. పత్తిని చివరి వరకు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌తో కిషన్‌రెడ్డి చర్చించారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలపై గిరిరాజ్ సింగ్‌కి విజ్ఞాపనలు అందజేశారు కిషన్‌రెడ్డి. పత్తిలో తేమ 12 శాతం మించకుండా ఉండాలని సూచించారు. కాటన్ కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 122 సెంటర్లలో పత్తి కొనుగోలు జరుగుతోందని తెలిపారు. తేమశాతం కొలిచే మిషన్లు కొనుగోలు కేంద్రాల్లో ఉంటాయని వెల్లడించారు. రైతులకు అండగా 122 సెంటర్లలోని కమిటీలు ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ని తాను కలిశానని తెలిపారు. తెలంగాణ పత్తి రైతుల సమస్యలను వివరించానని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం పత్తి కొనుగోలు ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. తెలంగాణలో మౌలిక వసతులు పెంచాలని సూచించారు. కాటన్ ఉత్పత్తి కేంద్రాలు పెంచాలని దిశానిర్దేశర చేశారు. మహారాష్ట్ర కోలలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తనను అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. రైతుల్లో అవగాహన తీసుకురావాలని సూచించారు. పత్తిలో తేమశాతం తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు కిషన్‌రెడ్డి. రైతుల్లో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన తీసుకురావాలని కోరారు. అందరూ ఒకేసారి పత్తిని జిన్నింగ్ మిల్స్‌కి తీసుకురావడంతో పంట కొనుగోలు చేయడంలో ఇబ్బంది ఏర్పడుతోందని వివరించారు. ఆన్‌లైన్‌లో ముందస్తుగానే పత్తిని ఏరోజు తీసుకువస్తారనేది రిజిస్టర్ చేసుకుంటే సమస్య ఉండదని చెప్పుకొచ్చారు. సీసీఐ నుంచి నేరుగా రైతుల ఖాతాకు డబ్బు వెళుందని స్పష్టం చేశారు. ఇతర దేశాల్లో కాటన్ రేటు తక్కువగా ఉందని తెలిపారు. ఉపాధి హామీ నిధులని పత్తిలో తేమ తగ్గించేందుకు రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేయాలని సూచించారు. మహారాష్ట్ర అకోలాలో హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ ద్వారా ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# వైద్యసిబ్బందికి వేతనాలు చెల్లించాలి

## మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



**హైదరాబాద్:** నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో టీవీవీపీ, బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. "ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకోవడమే తప్ప.. ఆచరించడం లేదు. వైద్య విధాన పరిషత్ రెగ్యులర్ ఉద్యోగులకు ప్రతి నెలా రెండు, మూడు వారాల వరకూ జీతాలు రాని పరిస్థితి ఉంది. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకైతే నెలల తరబడి జీతాలు అందడం లేదు. బస్తీ దవాఖానా వైద్య సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య సిబ్బందికి వేతనాలు చెల్లించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పొన్నం, అడ్లూరి మధ్య వ్యవహారం

మొదటి పేజీ తరువాయి

నేతను ఆ మాట అంటుంటే చూస్తూ ఉంటావా అని మంత్రి వివేక్ వెంకటస్వామిని మంత్రి లక్ష్మణ్ కుమార్ నిలదీశారు. ఇక, మంత్రి పొన్నం ప్రభాకర్- అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎపిసోడ్ పై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ రంగ ప్రవేశం చేశారు. ఇద్దరు మంత్రులకు ఫోన్ చేసి ఇరువురు సంయమనం పాటించాలని చెప్పినట్లు సమాచారం. అడ్లూరినీ ఉద్దేశించి పొన్నం కామెంట్స్ చేశారని ప్రచారం.. అడ్లూరిని ఉద్దేశించి మాట్లాడలేదని పొన్నం వివరణ ఇచ్చారు. పొన్నం కామెంట్స్‌ని తప్పు పట్టిన మంత్రి శ్రీధర్ బాబు.. పార్టీకి, ప్రభుత్వానికి ఇది మంచిది కాదంటూ శ్రీధర్ బాబు హితవు పలికారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మనస్పర్థలపై పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు మీడియం సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మహేష్ గౌడ్ ఫోన్ చేశారు. ఇద్దరు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని మహేష్ గౌడ్ సూచించారు. పొన్నం ప్రభాకర్ లాగా అహంకారంగా మాట్లాడటం తనకురాదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. మంత్రి వివేక్ లాగా తన దగ్గర డబ్బులు లేవని స్పష్టం చేశారు. తాను మంత్రి కావడం, ఆ సామాజిక వర్గంలో పుట్టడం తన తప్పా.. అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో సోనియా, రాహుల్, ఖర్గే, మీనాక్షిని కలుస్తానని వివరించారు. తాను కుర్చీలో కూర్చుంటే వివేక్ లేచి వెళ్లిపోతున్నారని చెప్పారు. తాను పక్కన ఉంటే వివేక్ ఓర్చుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం తాను ఆదిలాబాద్ పర్యటనలో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే కాంగ్రెస్ నేతలను కలుస్తానని అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. తాను మాదిగ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే మంత్రి పదవి వచ్చిందని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. నేను మంత్రి కావడం.. మా సామాజికవర్గంలో పుట్టడం తప్పా? అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. అయితే మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వ్యాఖ్యలపై తాను స్పందించనని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌తో విభేదాల నేపథ్యంలో ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షుడు నాతో మాట్లాడారు.. అదే ఫైనల్. రహ్మత్‌నగర్ భేటీలో ఏం జరిగిందో ఆయనకు వివరించా. అడ్లూరి వ్యాఖ్యలపై నేను స్పందించను. పార్టీ పరంగా మాకు మహేశ్ గౌడ్ ఆదేశాలు శిరోధార్యం అని అన్నారు.

# కాంగ్రెస్ నేత ఓటరు కార్డులు పంపిణీ చేయడం ఏంటి?


మొదటి పేజీ తరువాయి

టికెట్ ఆశావహుడు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నారని, పంపిణీ చేయడానికి ఆయనెవరని ప్రశ్నించారు. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తమ శాఖ బాధ్యతలు అప్పగించిందా అని మండిపడ్డారు. రాహుల్ గాంధీ చెబుతున్న ఓట్ చోరీ కంటే ఇది పెద్ద నేరం కాదా? అని కేటీఆర్ నిలదీశారు.

# హైకోర్టు తీర్పుకు లోబడే గ్రూప్-1 నియామకాలు

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థుల తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. వాదనల అనంతరం.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించి ంది. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన పిటిషన్లన్నీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో ఈనెల 15న విచారణకు రానున్న నేపథ్యంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈలోగా చేపట్టిన నియామకాలన్నీ.. రిట్ అప్పీల్స్‌పై ఇచ్చే ఫలితానికి లోబడి ఉంటాయని, హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పాటించాలని సుప్రీంకోర్టు సూచించింది. అవకాశం ఉన్నంత త్వరగా పిటిషన్లపై విచారణ ముగించి తగిన ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. ఈ కేసుకు ప్రాధాన్యత ఇచ్చి విచారణ పూర్తి చేయాలని సూచిస్తూ.. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై విచారణను ధర్మాసనం ముగించింది.



# సమ్మక్క సారక్క వర్సిటీలో వైవిధ్యానికి పెద్దపీట

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

## కిషన్‌రెడ్డితో కలిసి లోగో ఆవిష్కరణ

**ఢిల్లీ:** సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కేవలం సర్టిఫికెట్లు జారీ చేయడానికే పరిమితం కాకూడదని, వైవిధ్యానికి పెద్దపీట వేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం ఇక్కడ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్‌జోషి, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌లతో కలిసి యూనివర్సిటీ నూతన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో ఉండే ఈ విశ్వవిద్యాలయం స్థానిక గిరిజన భాషలను భారతీయ భాషలతో అనుసంధానం చేయడానికి వారధిగా పనిచేయాలని సూచించారు. త్వరలో కొత్త క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. "ప్రధాని నరేంద్రమోదీ ఆశీర్వాదం, కిషన్‌రెడ్డి నిరంతర ప్రయత్నం కారణంగా ఈ యూనివర్సిటీ సాకారమైంది. ఈ విశిష్ట విశ్వవిద్యాలయం అభివృద్ధికి రూ.800 కోట్లకు పైగా మంజూరు చేశాం. ములుగు ప్రాంతంలో ఎన్నో గిరిజన తెగలున్నందున అధ్యయనానికి విస్తృత అవకాశాలున్నాయి. ఈ వర్సిటీలో స్థానిక సమాజానికి అవసరమైన ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాలి. అక్కడి ప్రజల జీవనశైలి, ఆహారపుటలవాట్లు, నైపుణ్యాలు, ప్రకృతి సంపదలోని ఔషధగుణాలు, అరుదైన ఖనిజాలు తదితర అంశాలపై పరిశోధనలు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇది క్రీడా యూనివర్సిటీలా పనిచేయాలి. స్థానికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ యూనివర్సిటీ తరహాలోనూ వ్యవహరించాలి" అని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కోట్ల మంది భక్తుల నమ్మకానికి అనుగుణంగా ప్రధాని ఈ విశ్వవిద్యాలయానికి సమ్మక్క సారక్క అని పేరు పెట్టారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భూమి కేటాయించినందున త్వరగా భవనాల నిర్మాణం ప్రారంభించాలని ఆయన ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు

- కోడ్ ఉల్లంఘనలపై సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి




**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఈవీఎంలపై అభ్యర్థుల కలర్ ఫొటోలు ఉంటాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత పర్యవేక్షణ చేపడతామని వెల్లడించారు. బీఆర్కే భవన్‌లోని రాష్ట్ర సీఈవో కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించారు. భాజపా, కాంగ్రెస్, భారాస, ఆమ్‌ఆద్మీ, ఎంఐఎం తదితర పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఈసీ ప్రవేశపెట్టిన కొత్త సంస్కరణలు.. ఉప ఎన్నికలో వాటి అమలు గురించి పార్టీల ప్రతినిధులకు సుదర్శన్‌రెడ్డి వివరించారు. "ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉంటారు. అతివల ఓటింగ్ శాతం పెంచేందుకు మహిళా సిబ్బందిని అదనంగా ఏర్పాటు చేస్తాం. వృద్ధులు, దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీలు, ర్యాంపులు అందుబాటులో ఉంటాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ఉంటుంది. రాజకీయ పార్టీలు నియమావళిని కచ్చితంగా పాటించాలి. ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సహకరించాలి" అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీఈవో లోకేశ్‌కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, ఉప సీఈవోలు హరిసింగ్, సత్యవాణి పాల్గొన్నారు.

# అప్పు తీసుకుని ఎగ్గొట్టిన వ్యాపారి

మొదటి పేజీ తరువాయి

రూ. 10 కోట్లకు పైగా ఎగ్గొట్టిన సదరు ఘరానా చీటర్ ఇంటి పై బాధితుల దాడి చేశారు. ప్రజల సొమ్ములతో సుందరంగా కట్టుకున్న భవంతిని దగ్ధం చేసేందుకు ఉపక్రమించారు. ఇంటికి నిప్పంటించారు. నల్గొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పడమటి తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రజలకి వడ్డీల ఆశ చూపి రూ. 10 కోట్లకు పైగా దోచేసి, తీరా తిరిగి సొమ్ములివ్వమంటే, వాటిని ఎగ్గొట్టి తిరుగుతున్న బాలాజీ నాయక్ అనే వడ్డీ వ్యాపారి ఇంటి పై బాధితులు కక్ష కొద్దీ రెచ్చిపోయారు. ఇంటి అద్దాలు పగులగొట్టి, ఫర్నీచర్ ధ్వంసం చేసి తగలబెట్టారు. కోర్టుకు పోయి ఐపీ పెట్టి 300 మందికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న బాలాజీ నాయక్ ఇంటికి ఉదయం పెద్ద ఎత్తున బాధితులు తరలి వచ్చి బాలాజీ నాయక్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు

## కాంగ్రెస్, సీపీఐ నేతల చర్చలు



**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు బలమున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను పొత్తులో భాగంగా కేటాయించాలని సీపీఐ కోరగా వాటి జాబితా ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో భేటీ అయ్యారు. స్థానిక సంస్థలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై ఇరుపార్టీల నాయకులు చర్చించారు. కాంగ్రెస్, వామపక్షాలు పొత్తుతో పోటీచేస్తే ఇరుపక్షాలకూ మేలు జరుగుతుందని కూనంనేని సూచించారు. సానుకూలంగా స్పందించిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఆయా జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించి.. నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

# రూ.300కోట్ల దాల్ ట్రేడ్ కేసు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఏపీలో గత ప్రభుత్వ హయాంలో పలు ట్రేడింగ్ కంపెనీలు భారీగా నగదు లావాదేవీలు జరిపినట్లు అధికారులు చెబుతున్నారు. 2024 ఎన్నికల సమయంలోనూ భారీగా నగదు విత్‌డ్రా చేసినట్లు ఐటీ శాఖ గుర్తించింది. పలు ట్రేడింగ్ కంపెనీలు పౌరసరఫరాల శాఖ నుంచి అనుమతులు పొంది పప్పు దినుసులు సరఫరా చేయకపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలోనూ విశాఖపట్నంలో హిందుస్థాన్ ట్రేడర్స్, కర్నూలు వీకేర్ గ్రూప్‌లో సోదాలు జరిగాయి.

# బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో విచారణ

- మంత్రులతో సీఎం రేవంత్ సమాలోచనలు
- అభిషేక్ సింఘ్వీతో తాజాగా చర్చ




**హైదరాబాద్, అక్టోబర్ 7 :** బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సామాజిక న్యాయం దిశగా చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్న ఈ వ్యవహారంలో ఏ మాత్రం నిర్లక్ష్యం జరగకుండా ఉండేందుకు సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా పర్యవేక్షి స్తున్నారు. బుధవారం హైకోర్టులో కేసు విచారణకు రానున్న సందర్భంగా మంత్రులు, న్యాయనిపుణలుతో చర్చించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం సామాజిక సమతుల్యతకు సంబంధించిన కీలకమైన అంశమని ప్రభుత్వం భావిస్తోంది. కేసు పురోగతిని గంట గంటకు పర్యవేక్షిస్తూ, న్యాయపరంగా ఏ మార్పులు వచ్చినా తక్షణమే వ్యూహాన్ని సవరించుకునేలా ప్రత్యేక టీమ్‌ను సీఎం రేవంత్ ఏర్పాటు చేశారు. న్యాయ పోరాటంతో పాటు రాజకీయ, సామాజిక వర్గాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నాయి. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టు దాకా ప్రతి దశలోనూ బీసీల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం తన పూర్తి శక్తిని వినియోగిస్తోంది. సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలంగాణ తరఫున ప్రముఖ న్యాయ నిపుణులు అభిషేక్ సింగ్వి, సిద్దార్థ దవే లు హాజరై వాదనలు వినిపించారు. ఈ విచారణకు ముందే సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశాలు ఇవ్వడంతో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లతో కూడిన బృందం ఢిల్లీ వెళ్లి న్యాయ నిపుణులతో విస్తృతంగా చర్చించింది. కేసు ప్రాధాన్యత దృష్ట్యా భట్టి విక్రమార్క, మంత్రుల బృందం స్వయంగా సుప్రీంకోర్టు విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. ఈ క్రమంలో మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింగ్వి తో ఫోన్ లో మాట్లాడారు. బుధవారం హైకోర్టులో జరగనున్న బీసీ రిజర్వేషన్ల కేసు విచారణకు స్వయంగా హాజరై వాదనలు వినిపించాలని ఆయన కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలో సింగ్విని కలసి ఇదే విషయ–ంమై విజ్ఞప్తి చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత సున్నితమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించాలని వారు కోరారు. హైకోర్టులో జరగనున్న విచారణకు ముందు, కేసు పురోగతిపై సమగ్ర సమీక్ష జరపాలని సీఎం నిర్ణయించారు.

# పీసీ ఘోష్ కమిషన్‌పై విచారణ

## 12వ తేదీకి వాయిదా వేసిన హైకోర్టు



**హైదరాబాద్, అక్టోబర్ 7 :** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకొని చర్యలు తీసుకోవద్దని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ సందర్భంగా హైకోర్టు ఇప్పటికే ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు చేపట్టకూడదని కేసీఆర్, హరీశ్ తమ పిటిషన్లలో వాదించారు. ఆ నివేదికను పూర్తిగా రాజకీయ ఉద్దేశ్యాలతో రూపొందించారని, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా సరైంది కాదని వారు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా ఆదేశించింది. కమిషన్ తరఫున లాయర్ నిరంజన్ రెడ్డి ఈ విచారణ సందర్భంగా కౌంటర్ అఫిడవిట్ సమర్పించకపోవడంపై క్షమాపణలు కోరారు. కొన్ని వివరాలు సేకరించడంలో ఆలస్యం జరిగిందని, త్వరలోనే సమగ్రమైన కౌంటర్ సమర్పిస్తామని కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆయన వివరణను అంగీకరించి, తదుపరి విచారణ తేదీని నిర్ణయించింది. ఇక ఇదే కేసులో మాజీ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కూడా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. కమిషన్ నివేదికలో తమ పేర్లు ప్రస్తావించబడిన నేపథ్యంలో ప్రభుత్వం తమపై చర్యలు తీసుకోకుండా ఉండాలని వారు కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సీబీఐకి పంపిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు, ఆ నివేదిక ఆధారంగా నేరుగా చర్యలు చేపట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. సీబీఐ తన స్వతంత్ర విచారణను చట్టపరమైన విధానాల ప్రకారం కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణ వచ్చే నెల 12న జరగనుంది. అప్పటి వరకు కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ సీఎస్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌లపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది.

# నవీన్ యాదవ్ వైపే మొగ్గు


- అధిష్టానానికి పేరు సిఫార్సు
- పోటీ నుంచి తప్పుకున్న బొంతు

**హైదరాబాద్, అక్టోబరు 7 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ కి లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై పార్టీ శ్రేణులతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో నవీన్ యాదవ్ వైపు సీఎం రేవంత్ రెడ్డి మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో నుంచి తప్పుకున్నట్లు బొంతు రామ్మోహన్ ప్రకటించారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయిస్తుందని బొంతు రామ్మోహన్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం తాను పనిచేస్తానని బొంతు రామ్మోహన్ ప్రకటించారు. మరోవైపు.. జూమ్ సమావేశం లో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ సెక్రటరీలు, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చేసిన సర్వే రిపోర్టులు , అభ్యర్థుల సామాజిక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. అయితే, రెండు పేర్లతో ఏఐసీసీకి సిఫారసు చేయాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు.

# రైలు నుంచి అన్నదమ్ముల తోసివేత

## ఒకరు మృతి.. ప్రణాపాయంలో మరొకరు

**హైదరాబాద్, అక్టోబరు 7 :** హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళుతున్న దక్షిణ ఎక్స్‌ప్రెస్‌లో తాజాగా షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఇద్దరు అన్నదమ్ముల్ని తోటి ప్రయాణికుడు రైలు నుంచి కిందకు తోసేయడంతో ఒకరు మరణించగా మరొకరు కోమాలోకి వెళ్లిపోయారు. ఘట్‌కేసర్ వద్ద ఈ దారుణం జరిగింది. బాధితులను మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్వాని సోదరులుగా పోలీసులు గుర్తించారు. అన్నకు 33 ఏళ్లు, తమ్ముడికి 30 ఏళ్లు అని చెప్పారు. వారి మధ్య ఘర్షణకు కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా అన్న కోమాలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం అతడికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న సికింద్రాబాద్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



# నల్గొండలో ఇంటర్ విద్యార్థిని దారుణహత్య

**నల్గొండ:** నల్గొండలో దారుణం చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని గడ్డం కృష్ణ అనే యువకుడు హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలలో చదువుతున్న మైనర్ బాలికను ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం కృష్ణ (22) గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలోనే మాట్లాడుకుందామని పిలిచి.. బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. ఈ హత్యకు ఓ ఆటో డ్రైవర్ సహకరించినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పరిశీలించారు. నిందితుడు కృష్ణపై టౌన్ పీఎస్‌లో రేప్, పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఘటనలో ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారిస్తున్నట్టు చెప్పారు. సాక్ష్యాధారాలు సేకరించి నిందితులకు త్వరగా శిక్ష పడే విధంగా కృషి చేస్తామన్నారు.

# ఆర్టీసీ ఛార్జీల పెంపు దారుణం

- ప్రజలపై భారం మోపడమే..
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబరు 7 :** తెలంగాణలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుపై రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ప్రభుత్వం చార్జీలు పెంచడం అన్యాయం అని ఆయన విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందని, కానీ అదే సమయంలో పురుషులు, విద్యార్థులపై అదనపు భారాన్ని మోపుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఇంట్లో ఒక మహిళ ఉచితంగా ప్రయాణం చేస్తే, కుటుంబంలోని మిగిలిన సభ్యులందరికీ రెండింతలు చార్జీలు కట్టాల్సి వస్తోంది. దీంతో ఒక కుటుంబానికి నెలకు కనీసం ఇరవై రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఈ విషయం ఇప్పుడు ప్రతి తెలంగాణ కుటుంబానికీ అర్థమైందని ఆయన అన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అనే పథకం ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రారంభించినట్టు ప్రభుత్వం చెబుతుందేమో కానీ, వాస్తవానికి ఇది ఆర్థిక సమతుల్యతను దెబ్బతీసే నిర్ణయమని వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఇప్పటికే ఆర్థికంగా కష్టాల్లో ఉన్న సమయంలో ఈ విధంగా వసూళ్లను పెంచడం ప్రజలపై నేరుగా భారం మోపడం అవుతుందని ఆయన అన్నారు. ఆర్టీసీని బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉన్నా, అది ప్రజల వెన్నుపైన భారం మోపడం ద్వారా సాధ్యం కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తన ఆర్థిక లోటును పూడ్చుకునేందుకు ప్రయాణికులను బలితీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడం మానేసి, ప్రచారపరమైన పథకాల పేరుతో బడ్జెట్ నష్టాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజలతో మోసం చేయడమేనని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కూడా ఈ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, చార్జీల పెంపును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల జీవన వ్యయాలు ఇప్పటికే పెరిగిపోయాయని, ఇలాంటి చర్యలు సాధారణ కుటుంబాలపై మరింత భారం మోపుతాయని వారు పేర్కొన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఆర్టీసీ చార్జీల పెంపు అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చావిషయంగా మారింది.

# ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా 9న ఛలో బస్ భవన్

## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్




**హైదరాబాద్, అక్టోబర్ 7 :** ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 9వ తేదీన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్కు పిలుపునిచ్చింది. ఛార్జీల పెంపు పేదలపై భారం పడుతందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఛలో బస్ భవన్ ధర్నాలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో సహా.. బీఆర్ఎస్ నేతలు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. నందినగర్ నుంచి కేటీఆర్.. మెహిదీపట్నం నుంచి హరీశ్‌రావు బస్సులో ప్రయాణం చేసి బస్ భవన్‌కి చేరుకుంటారని చెప్పుకొచ్చారు తలసాని శ్రీనివాస్ యాదవ్. పెంచిన బస్సు చార్జీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం అంటూనే.. వాళ్ల కుటుంబ సభ్యులపై భారం వేయడం అన్యాయమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి కోల్పోయిన వారి సంఖ్యనే ఎక్కువని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ పడిపోయిందని ఆరోపించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా చెప్పిందని గుర్తుచేశారు తలసాని శ్రీనివాస్ యాదవ్. గౌలిగూడ బస్ డిపోను రూ.400కోట్లకు ప్రైవేట్ వాళ్లకి ఇచ్చారని ఆరోపించారు. మియాపూర్, ఉప్పల్‌తో సహా.. వివిధ డిపోలను ప్రైవేటీకరణ చేయబోతున్నారని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసి కార్మికులను ముంచాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను స్వాగతిస్తున్నామని.. కానీ ఆర్టీసీ డ్రైవర్లతోనే ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని సూచించారు. ఎలక్ట్రిక్ వాహనాలు నడపడానికి ఆర్టీసీ ఉద్యోగులకు ట్రైనింగ్ ఇవ్వాలని సూచించారు.

# భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## విదేశాలకు తరలించే క్రమంలో ఢిల్లీ పోలీసుల దాడి

**న్యూఢిల్లీ, అక్టోబరు 7 :** దిల్లీలో పోలీసులు భారీగా ఎర్రచందనం నిల్వలను పట్టుకున్నారు. దాదాపు 10 టన్నుల దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.6 కోట్ల వరకూ ఉంటుందని తెలిపారు. చైనాతోపాటు ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసేందుకుగానూ.. వాటిని తిరుపతి నుంచి దేశ రాజధానికి తరలించినట్లు తెలుస్తోందన్నారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించిన ఓ కేసులో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇచ్చిన నిఘా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు దిల్లీ సౌత్ ఈస్ట్ డీసీపీ హేమంత్ తివారీ వెల్లడించారు. ఎర్రచందనం దుంగల చోరీకి సంబంధించి తిరుపతిలో ఓ కేసు నమోదైంది. అక్కడి పోలీసుల దర్యాప్తులో భాగంగా.. వాటిని దిల్లీకి అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా.. దిల్లీ పోలీస్ ఎస్‌టీఎఫ్, ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ యూనిట్‌లు కలిసి దిల్లీ తుగ్లకాబాద్‌లోని ఒక గోదాంలో తనిఖీలు చేపట్టాయి. ఎర్రచందనం నిల్వలను స్వాధీనం చేసుకున్నాయి‘ అని డీసీపీ హేమంత్ తివారీ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇర్ఫాన్, మహారాష్ట్రకు చెందిన అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితులకు అంతర్జాతీయ ముఠాతో సంబంధాలు ఉన్నాయన్నారు.



# స్థానిక ఎన్నికల్లో పోటీకి మల్లన్న సిద్ధం

- పార్టీకి గుర్తు కేటాయించాలని హైకోర్టులో పిటిషన్
- తగు చర్యలు తీసుకోవాలని ఈసీని ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్, అక్టోబర్ 7 :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బిసిలకు రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడ్డ ఈ పార్టీ రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ పార్టీ గుర్తింపు, పార్టీ గుర్తుపై హైకోర్టులో మల్లన్న పిటిషన్ దాఖలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలు కల్పించాలని పిటిషనర్ నవీన్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ అభ్యర్థనను పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు, రాజ్యాధికారం లక్ష్యంగా ఇటీవల తెలంగాణ రాజ్యాధికార పార్టీని తీన్మార్ మల్లన్న స్థాపించిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 17న తాజ్ కృష్ణ హోటల్‌లో పార్టీని స్థాపించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండాను ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో రూపొందించారు. జెండా మధ్యలో పిడికిలి బిగించిన చేయితో పాటు కార్మిక చక్రం, వరి కంకులు ఉన్నాయి. జెండాపై భాగంలో ఆత్మగౌరవం, అధికారం, వాటా నినాదాలను రాశారు. పిడికిలి కింది భాగంలో పార్టీ పేరును ముద్రించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని మల్లన్న కోరడం.. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. మల్లన్నకుఎన్నికల సంఘం ఎలాంటి గుర్తును కేటాయిస్తుందో అన్న ఆసక్తి పెరిగింది.



# ‘ఎయిరిండియా ప్రమాదం’పై నిష్పక్షపాత దర్యాప్తు

## పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ :** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం దర్యాప్తుపై వస్తోన్న ఆందోళనలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. దర్యాప్తులో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని.. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతోందన్నారు. విమాన ప్రమాదంపై ‘ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో’ ఇచ్చిన ప్రాథమిక నివేదికపై విమర్శల నేపథ్యంలో కేంద్ర మంత్రి ఇలా స్పందించారు. “విమాన ప్రమాదాల వ్యవహారాలను చూసే బాధ్యత ఏఏఐబీది. కేవలం వాస్తవాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. ఎవరి ప్రభావం దీనిపై ఉండదు. నిబంధనల ప్రకారం.. పారదర్శకంగా, స్వతంత్ర పద్ధతిలో దర్యాప్తు జరుగుతోంది. ప్రాథమిక నివేదికపై వ్యాఖ్యలు చేయడం తొందరపాటే అవుతుంది. అసలేం జరిగిందనే విషయంపై స్పష్టత రావాలంటే తుది నివేదిక వచ్చే వరకు వేచి చూడాల్సిందే” అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. దిల్లీలో ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. విలేకరులతో ఈ విధంగా మాట్లాడారు. దేశంలోని అన్ని బోయింగ్ 787 విమానాల్లో క్షుణ్నంగా తనిఖీలు చేయాలని, ఎలక్ట్రికల్ వ్యవస్థల పనితీరుపై దర్యాప్తు చేపట్టాలని కోరుతూ ‘ది ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్(ఎఫ్ఐపీ)’ ఇటీవల డీజీసీఏకు లేఖ కూడా రాసిన విషయం తెలిసిందే. బోయింగ్ విమానాల్లోని భద్రత ప్రమాణాలపై గతంలోనూ తాము ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని అందులో గుర్తు చేసింది. ఈ క్రమంలోనే పౌర విమానయాన శాఖ మంత్రి క్లారిటీ ఇచ్చారు.

# యాపిల్, గూగుల్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ సొంత యాప్ స్టోర్

**న్యూఢిల్లీ :** ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ ఇప్పుడు సొంత యాప్ స్టోర్‌ను తీసుకొస్తోంది. ఈ యాప్ స్టోర్‌ను నేరుగా చాట్‌జీపీటీలోనే అందుబాటులోకి తీసుకురానుంది. దీని ద్వారా వినియోగదారులు తమ సొంత భాషలోనే యాప్‌లతో సంభాషిస్తూ వాటిని ఉపయోగించుకునే సౌకర్యం కల్పించనుంది. తద్వారా ప్రస్తుత మొబైల్ యాప్ ఎకోసిస్టమ్‌ను సమూలంగా మార్చివేసే అవకాశముందని విశ్లేషకుల అభిప్రాయపడుతున్నారు. తద్వారా గూగుల్, యాపిల్ వంటి దిగ్గజాలకూ పోటీ ఇవ్వనుంది. ఓపెన్‌ఏఐ డెవ్‌డే ఈవెంట్ సందర్భంగా ఈ కొత్త యాప్ స్టోర్ గురించి ఓపెన్‌ఏఐ ప్రకటించింది. ఇది సాధారణ చాట్‌బాట్ మాత్రమే కాకుండా, వ్యక్తిగత అనుభవాన్ని అందించే ఇంటరాక్టివ్ యాప్‌ల కేంద్రంగా మారనుంది. దీన్నో కొత్తం తరం యాప్‌గా ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ అభివర్ణించారు. వినియోగదారులు చాట్‌జీపీటీని అడిగి స్పాటిఫైలో ప్లేలిస్ట్ సృష్టించడం, ప్రాపర్టీ యాప్‌లో ప్రాపర్టీలు వెతకడం వంటి పనులు చేయొచ్చు. చాట్‌జీపీటీ వినియోగదారులకు ఏ యాప్‌లను కనెక్ట్ చేయాలో, ఏ డేటా పంచుకోవాలో సూచిస్తుంది. దీంతో సంప్రదాయ యాప్‌లతో పోలిస్తే ఇది మరింత ప్రైవసీ–స్నేహపూర్వకమైన, సంభాషణాత్మక ఇంటర్‌ఫేస్‌గా ఉంటుందని శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ల మాదిరిగా సాఫ్ట్‌వేర్‌ను డివైజ్‌లోకి డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం ఉండదు. చాట్‌జీపీటీలోనే మనకు అవసరమైన యాప్‌ను వినియోగించుకోవచ్చు. ఈ యాప్‌లను డెవలప్ చేయడానికి సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కిట్ (ఎస్‌డీకే)ను అందిస్తోంది. ఈ ఏడాది చివర్లో యాప్‌ల సబ్మిషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. డెవలపర్‌లకు తమ యాప్‌ల ద్వారా ఆదాయం పొందే మార్గాల గురించి కూడా కంపెనీ వివరించనుంది. కొత్తగా ప్రవేశపెట్టిన కామర్స్ ఫంక్షనాలిటీ ద్వారా వినియోగదారులు నేరుగా చాట్‌జీపీటీ యాప్‌లోనే కొనుగోళ్లు చేయొచ్చు.

# న్యాయమూర్తులపై పని ఒత్తిడి!



**మనదేశ జనాభాకు తగ్గట్లుగా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన తక్షణ అసవరం ఉంది. ఇప్పటికే కేసుల సంఖ్యపెరుగుతోంది. ఒక్కో కేసుకు దశాబ్దాల సమయం పడుతోంది. న్యాయమూర్తులపై ఒత్తిడి పెరుగుతోంది. రోజువారీ కేసులకే సమయం సరిపోవడం లేదు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో సుప్రీంకోర్టుకు 34 మంది న్యాయమూర్తులు సరిపోతారా.. అనేది కీలక ప్రశ్న. ఇక హైకోర్టుల్లో 63 లక్షలకుపైగా, దిగువ కోర్టుల్లో దాదాపు ఐదు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ కేసులు కొండలా పేరుకుపోవడం ఆందోళనకరం. అత్యున్నత న్యాయస్థానం చరిత్రలోనే ఎన్నడూలేనంత అత్యధికంగా 88,417 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.**

న్యాయం ఆలస్యం కావడమంటే న్యాయం జరగకపోవడమే అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఎందుకంటే అండర్ ట్రయల్ ఖైదీలు కేసులు తెమలక ఏళ్లుగా జైళ్లల్లో మగ్గుతున్నారు. న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కినా ఏళ్లతరబడి కేసులు తెమలడం లేదు. రాజకీయ కేసులు తప్ప క్రిమినల్ తదితర కేసులు తేల్చడం లేదు. ఈ క్రమంలో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలి. సుప్రీం కోర్టు బెంచ్‌లను పెంచాల్సిన అవసరాన్ని గుర్తించాలి. కోర్టుల్లో తగినంతమంది న్యాయమూర్తులను, సిబ్బందిని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదు-పాయాలు కల్పించాల్సి ఉంది. లోక్ అదాలత్‌లు లాంటివి నిర్వహించి ఇరుపక్షాలు అంగీకరించిన కేసులను పరిష్కరిస్తే కోర్టులపై ఒత్తిడి తగ్గుతుంది. తీర్పులకు సమయం నిర్దేశిరచాలనే వాదన కూడా వుంది. న్యాయస్థానాలకు పూర్తిస్థాయిలో సహకరించాల్సిన కేంద్రం అనేక సందర్భాల్లో అడ్డుపడటం, అడ్డగోలుగా విమర్శలు చేయడం పరిపాటిగా వుంది. న్యాయమూర్తుల నియామకానికి ప్రత్యేకంగా ఒక జ్యుడీషియల్ కమిషన్ ఉండాలన్న చర్చ చాలాకాలంగా వుంది. అయితే నేడు కొలీజియం వ్యవస్థ ఆ బాధ్యత నిర్వహిస్తోంది. కాని కేంద్రప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం నియామకాలను తీవ్రంగా జాప్యం చేస్తోంది. ఏవో సాకులు చూపి తిరస్కరిస్తోంది. ఇంకొన్ని సందర్భాల్లో కొలీజియం, కేంద్ర న్యాయశాఖ మధ్య వివాదాస్పదం అవుతున్నవే వున్నాయి. భారత రాజ్యాంగం, పాలన, శాసన, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన లక్ష్మణరేఖలను నిర్దేశించింది. పాలకులు వాటిని ఉల్లంఘించిన సందర్భాల్లోనే ఇటువంటి పరిస్థితి ఏర్పడుతోంది. నాగరిక సమాజంలో సత్వర న్యాయం అందించడం వ్యవస్థ బాధ్యత. అందుకోసం సుప్రీంకోర్టు తీసుకుంటున్న చొరవకు కేంద్రం వీలైనంత తోడ్పాటు నందించాలి. అప్పుడే పెండింగ్‌కు అడ్డుకట్టపడటంతోపాటు సత్వర న్యాయం అందేందుకు అవకాశముంటుంది. ఎందుకంటే ఇటీవల హైదరాబాద్ జర్నలిస్టుల హౌజింగ్ సొసైటీ కేసులో దాదాపు 17 ఏళ్ల నిరీక్షణ తరవాత పరస్పర విరుద్ద తీర్పులు వచ్చాయి.

జస్టిస్ ఎన్‌వి రమణ ఇచ్చిన తీర్పుకు భిన్నంగా మళ్లీ తదుపరి సిజెఐ తీర్పు వచ్చింది. దీనిపై అప్పీల్‌కు వెళితే కేసును కొట్టివేశారు. ఇది సమాజంలో ఓ పేదవర్గాల కోసం ప్రభుత్వం అనుసరించి గృహ సంబంధ విషయం. దీంతో జర్నలిస్టులు రోడ్డున పడ్డారు. ఇందులోని మెరిట్స్‌ను గుర్తించక పోవడంతో జర్నలిస్టులు ఆందోళనకు కారణమయ్యింది. కేసులో ప్రభుత్వం కూడా గట్టిగా వాదనలు ఇవ్వలేకపోయింది. జర్నలిస్టులకు 17 ఏళ్ల క్రితం ఎందుకు ఇంటి స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందో ధర్మాసనం ముందుంచ లేపోయింది. కేసు వేసిన వారు సైతం జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులను తెలుసు కోకుండా కోర్టుకు వెళ్లారు. ఇదంతా ఎందుకుంటే కేసు ఏదాదిలోనే తేలివుంటే సమస్య వచ్చేది కాదు. అప్పుడే ప్రభుత్వాలు తగిని నిర్ణయాలు తీసుకునే వీలుండేది. కేవలం కోర్టుల్లో దశాబ్దన్నరం కాలంగా నలిగిపోచి చివరకు అన్యాయం జరగడంతో తమ సమస్యలపై నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం లోపం కూడా ఉంది. అందుకే కేసులు సత్వరంగా పరిష్కారం కావాలంటే న్యాయమూర్తుల సంఖ్యను ఇప్పుడున్న దానికి కనీసం పదివంతులు పెంచాలి. అప్పుడు త్వరగా పరిష్కారం దక్కుతుంది. జైళ్లలో మగ్గుతున్న ఎందరికో ఊరట కలుగుతుంది. లేకుంటే కేసులు తేలకుండానే ట్రయల్ ఖైదీలు జైళ్లల్లో మగ్గాల్సి వస్తోంది. జాతీయ జ్యుడీషియల్ గ్రిడ్ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం 69,605 సివిల్, 18,887 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2020 వేసవి సెలవుల సమయంలో అనేక సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రస్తుత సిజెఐ బిఆర్ గవారు వేసవి సెలవుల్లోనూ పాక్షికంగా పనిచేసే పద్ధతిని తీసుకొచ్చారు. కొల్‌కతా, మహారాష్ట్ర హైకోర్టుల్లో కేసుల పెండింగ్ అత్యధికంగా ఉంది. జనాభాతో పోల్చితే న్యాయమూర్తుల నిష్పత్తి ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే మనదేశంలోనే అత్యంత తక్కువగా ఉండటం కేసుల పెండింగ్‌కు కారణమవుతోందన్న వాదన ఉంది.

అమెరికాలాంటి దేశాల్లో సగటున ప్రతి 10 లక్షల జనాభాకు 150 మంది వరకూ న్యాయమూర్తులుండగా, మన దేశంలో 21 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. కోర్టుల్లో కేసులు భారీగా పెరిగిపోవడానికి అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ కేసులతో న్యాయస్థానాలపై ఒత్తిడి తీసుకొస్తున్నాయి. దేశంలో కార్పొరేట్, అవినీతి, నేరగ్రస్థ రాజకీయాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. చట్టసభల సభ్యుల్లో 45 శాతం మందికిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో చట్ట సభల సభ్యులు, అధికారులపై కేసులను పరిష్కరించడం కూడా అత్యవసరం. ఇక ఇతర కారణాల విషయానికి వస్తే న్యాయవాదులు తరచూ వాయిదాలు కోరడం, స్థానికంగా పరిష్కరించదగినవి కూడా కోర్టులకు తీసుకురావడం తదితర కారణాల వల్ల అసంఖ్యాకంగా కేసులు పెరిగిపోతున్నాయి. రిటైర్డ్ న్యాయమూర్తుల సేవలు సివిల్ కేసుల విషయంలో వినియోగించుకుని సుదీర్ఘకాలంగా వాయిదాలున్న కేసుల సంగతి తేల్చాలనే సూచన ఉంది. ఏదేమయినా ఈ విషయంలో కేంద్రం ఇక ఎంతమాత్రం ఉపేక్షించకుండా హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచి , కేసుల సత్వర పరిష్కారం కోసం ప్రయత్నం చేయాల్సి ఉంది.

# దేశం నివ్వెర పోయే ఘటన

## చీఫ్ జస్టిస్‌పై దాడి అత్యంత హేయం



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 :** దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై మదం తలకెక్కించుకున్న ఓ న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన ఘటన అత్యంత హేయమైన చర్యగా చూడాలి. ఇది మాటలకు అందని ఆందోళన కర ఘటనగా చూడాలి. సుప్రీం కోర్టులో ఓ న్యాయవాది ఎంత మదమెక్కిన వాడు అయితే తప్ప ఇలాంటి ఉన్మాద చర్యకు పాల్పడడు. ఈ ఘటన దేశం యావత్తూ ఆందోళనకు గురి చేసింది. ప్రధాన న్యమూర్తిపైనే దాడికి తెగబడడం క్షమించరాని నేరం. సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకుగొంకూ లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపు దూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించక పోయివుంటే..దాడి జరిగి ఉండేది. ఈ హఠాత్పరిణామం తెలిసిన దేశ ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని జస్టిస్ గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. జస్టిస్ గవాయ్ పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాల్సిందే. స్టిస్ గవాయ్ పై దాడి సాదాసీదా యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. గవాయ్ పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తున్నారు. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. కర్తవ్య కార్యాచరణెళి వైవిధ్యభరిత భారతావనికి, రాజ్యాంగానికి తిరుగులేని రక్షణ కవచం. జస్టిస్ గవాయ్ చిత్తశుద్ధి, ఆయన ధృడచిత్తం అభినందనీయం. అయితే ఈ దాడికి కారణమైన శక్తులు ఎంతటి వారైనా శిక్షించాల్సిందే.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు భారీ షాక్

- కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు
- ఓటరు కార్డులు పంచడంపై కేసు నమోదు



**హైదరాబాద్, అక్టోబర్ 7 :** జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అయ్యింది. మధురా నగర్ పోలీస్ స్టేషన్‌లో జూబ్లీహిల్స్ ఎన్నికల అధికారి రజినీకాంత్ రెడ్డి నవీన్ యాదవ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నవీన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా నవీన్ యాదవ్ ఓటర్ కార్డులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యగా భావించిన ఎన్నికల సంఘం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నవీన్ యాదవ్ మీద బీఎన్ఎస్ 170, 171, 174తో పాటు ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు అయ్యింది. ఎన్నికల సంఘం నిబంధనల ఉల్లంఘనల మీద అధికారుల సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు అవ్వడం కాంగ్రెస్‌కు భారీ దెబ్బగా చెప్పుకొవచ్చు. నవీన్ యాదవ్‌ను జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా అనుకున్నట్లు రాజకీయా వర్గాల్లో వార్తలు కూడా వినిపించాయి. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్‌పై కేసు నమోదు అవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే తాజాగా.. ఎన్నికల సంఘంకు ఎంపీ రఘునందన్ రావు, నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్‌లో ఓటర్ కార్డులు అందజేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ఎన్నికల సంఘం.. నవీన్ యాదవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.



## 60కోట్ల మోసం కేసులో విచారణ

### ముంబై పోలీస్ విచారణకు శిల్పాశెట్టి

**ముంబై, అక్టోబర్ 7 :** ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో తాజాగా శిల్పాశెట్టిని ముంబయి పోలీసులు విచారించారు. 4 గంటల పాటు విచారించిన పోలీసులు ఆమె బ్యాంక్ స్టేట్‌మెంట్ వివరాలు, ఇతర ఖర్చుల గురించి ఆరాతీసినట్లు తెలుస్తోంది. కొన్ని కీలకమైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ కేసు విషయంలో శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాను కూడా ఇటీవల పోలీసులు విచారించారు. కొన్ని కంపెనీల్లో రూ.60కోట్లు పెట్టుబడులుగా పెట్టినట్లు ఆ సమయంలో ఆయన వెల్లడించారు. దీంతో ఈ నిధుల్ని నిజంగానే సంబంధిత కంపెనీలకు మళ్లించారా లేదా ఇతర వ్యక్తిగత ఖర్చులకు ఉపయోగించారా అనే దానిపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోభాగంగా శిల్పాను విచారించినట్లు తెలుస్తోంది. ఇక శిల్పా దంపతులు ఇటీవల థాయ్‌లాండ్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు దాన్ని తిరస్కరించింది. ఈ కేసు విషయంలో స్పష్టత వచ్చేవరకూ విదేశాలకు వెళ్లడానికి వీల్లేదని పేర్కొంది.

# ఆప్ నేత కేజ్రీవాల్‌కు ఊరట

## ఢిల్లీ లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళా కేటాయింపు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 :** ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కేంద్రం ఎట్టకేలకు అధికారిక నివాసం కేటాయించింది. ఇకపై 95, లోధి ఎస్టేట్‌లో టైప్ 7 బంగళాలో ఆయన ఉండనున్నారు. ఢిల్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం గత ఏడాది అక్టోబరులో ఆయన సీఎం అధికారిక నివాసాన్ని ఖాళీ చేసిన విషయం తెలిసిందే. అయితే.. ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రులకు ప్రభుత్వ వసతి కేటాయించే నిబంధన లేదు. దీంతో ఆయన ఆప్ రాజ్యసభ ఎంపీ అశోక్ మిత్తల్‌కు కేటాయించిన లుటియన్స్‌లోని ఫిరోజ్‌షా రోడ్డులో ఉన్న 5వ నంబరు బంగళాలో తాత్కాలికంగా ఉంటున్నారు. ఈక్రమంలోనే గుర్తింపుపొందిన జాతీయ పార్టీ అధ్యక్షుడిగా కేజ్రీవాల్ కు తగిన నివాసం కేటాయించాలంటూ ఆప్ న్యాయపోరాటం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం నూతన బంగళాను కేటాయించింది. బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన 35, లోధి ఎస్టేట్‌లోని బంగళాను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆప్ కోరింది. కానీ, దాన్ని జులైలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీకి కేటాయించింది. కేజ్రీవాల్‌కు ఇప్పుడు కొత్తగా కేటాయించిన ఇంట్లో గతంలో భాజపా నేత, జాతీయ మైనారిటీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పుర ఉండేవారు.నూతన నివాసాన్ని కేజ్రీవాల్ దంపతులు ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. పక్కనే ఉన్న 97వ భవనంలో ప్రస్తుతం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఉంటున్నారు. ఇదిలాఉండగా.. సీఎంగా ఉన్నప్పుడు సివిల్ లైన్స్ ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్డులోని ఆరో నంబరు బంగళాను కేజ్రీవాల్ అధికార నివాసంగా ఉపయోగించేవారు. ఆ సమయంలో దానికి అనేక హంగులు చేసి పునర్నిర్మించారు. ఇందులో ఎంతో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ.. 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా విమర్శలు గుప్పించింది. ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. ఇప్పుడు ఈ భవనాన్ని ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌గా మార్చాలని ఢిల్లీ లోని భాజపా ప్రభుత్వం యోచిస్తోంది.

## కొమురం భీమ్ ఆశయసాధనకు కృషి

- ఆదివాసీల అభివృద్ధితోనే ఇది సాధ్యం
- వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్ 7 :** ఆదివాసీల అభివృద్ధితోనే కొమరం భీం ఆశయాలు నెరవేరుతాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చారు. ఆయన ఆశయాల కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఐటీడీఏ ఏర్పాటులోనూ కొమరం భీం స్ఫూర్తి ఉందన్నారు. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీం వర్ధంతి సందర్భంగా ట్యాంక్ బండ్‌పై ఆ మహానీయుడు విగ్రహానికి మంత్రి సీతక్క పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొమరం భీం వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని.. దానికి అనుగుణంగా ప్రత్యేక జీవో ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ మహానాయకుడి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కొమరం భీం పోరాటం.. ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని చెప్పుకొచ్చారు. మా గుడాల్లో మా రాజ్యం కావాలని మా అడవుల మీద మాకు హక్కు ఉండాలని పోరాటం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, తొలి ప్రధాని నెహ్రూ ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగంలో ప్రత్యేక రక్షణలు కల్పించారని తెలిపారు. కొమరం భీం స్ఫూర్తితో గిరిజన మంత్రిత్వ శాఖ ఏర్పాటు అయ్యిందని వెల్లడించారు. రాజ్యాంగంలో ఈశాన్య రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారన్నారు. మైదాన ప్రాంత రాష్ట్రాల్లోని ఆదివాసీల పరిరక్షణ కోసం షెడ్యూల్ 5ను రాజ్యాంగంలో చేర్చారని చెప్పారు.

## అప్పుడు మోదీ ప్రశంసలు..

# ఇప్పుడు 'టికెట్' వార్తలు

### ఎన్నికల్లో పోటీపై గాయని స్పందన



**బిహార్ :** బిహార్ శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లపై ప్రచారం మొదలైంది. అందులోభాగంగా జానపద గాయని మైథిలి ఠాకూర్ భాజపా నుంచి బరిలోకి దిగనున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటిపై తాజాగా ఆమె స్పందించారు. భాజపా రాష్ట్ర ఇన్‌ఛార్జ్ వినోద్ తావ్డే, కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్‌రాయ్‌తో మైథిలి ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంపై తావ్డే ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అందులో ఆర్జేడీ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మైథిలి కుటుంబం బిహార్‌ను వీడినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి తిరిగి రావాలని వారు అనుకుంటున్నారని వెల్లడించారు. ఈ పోస్టుపై మైథిలి స్పందిస్తూ.. బిహార్ కోసం గొప్పగా కలలు కనే వ్యక్తులను కలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోస్టులు కాస్త వైరల్‌గా మారాయి. ఎన్నికల నేపథ్యంలో భాజపా ఆమెను బరిలో దింపేందుకు సిద్ధమైనట్లు ప్రచారం మొదలైంది. ఇక, గతంలో ఈమె ప్రధాని నరేంద్రమోదీ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శబరిని ఉద్దేశిస్తూ మైథిలి పాడిన పాటకుగాను ప్రధాని ఆమెను అభినందించారు. ఈ వార్తలపై తాజాగా మైథిలి స్పందిస్తూ.. తనకు టికెట్ ఇచ్చి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తే కచ్చితంగా పరిశీలిస్తానన్నారు. రాజకీయాల్లోకి వచ్చేందుకు ప్రస్తుతం తాను సిద్ధంగా ఉన్నానని విలేకరులతో పేర్కొన్నారు. టికెట్ ఇచ్చే విషయం ఇంకా ఖరారు కాలేదన్నారు. పలు కార్యక్రమాల్లో భాగంగా తాను అనేకమంది నాయకులను కలుస్తున్నానని వెల్లడించారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఎన్నికల్లో పోటీపై వారి నుంచి తనకు ప్రతిపాదన వస్తే అంగీకరిస్తానని తెలిపారు.

# పాలేరు వాగును దోచుకుంటున్న ఇసుక మాఫియా

**ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ దందా!**

**రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా**

**పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక సరఫరా పేరుతో పాలేరు ఏటిలోని గ్రామ సంపదను పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తూ కొందరు కేటుగాళ్లు లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు. స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఈ దందా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**







**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మండలంలోని ఆంధ్ర సరిహద్దు అయిన పెద్దమండవ, మల్కాపురం, అప్పల నరసింహపురం రోడ్డు నుండి, చెన్నారం, సుదేపల్లి, రామచంద్రపురం, పైనంపల్లి వంటి గ్రామాల్లోని పాలేరు ఏటి నుంచి ఇసుక అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో మాత్రం ఉదయం నుండి అర్ధరాత్రి వరకు ఇసుక తరలింపు జరుగుతూనే ఉంది. సేకరించిన ఇసుకను కూసుమంచి, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాలకు తరలించి, ఒక్కో ట్రాక్టర్ ఇసుకను 6,500 నుండి 8,000 వరకు అమ్ముకుంటూ ఇసుక మాఫియా భారీగా లాభాలు ఆర్జిస్తోంది. స్థానికులకు అందని ఇసుక, బెదిరింపులు స్థానికంగా ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామస్తులకు మాత్రం అది దక్కడం లేదు. స్థానిక అవసరాల కోసం ఒక్కో ట్రాక్టర్ ఇసుకను 3,500కు అందించాలని గ్రామస్తులు కోరుతున్నా, ఇసుక మాఫియా డిమాండ్‌ను పెంచి, సొంత గ్రామ ప్రజలకు సైతం ఇవ్వకుండా అడ్డుకుంటోంది. అంతేకాకుండా, మాఫియాకు వ్యతిరేకంగా ఎవరైనా కొత్తగా ఇసుక రవాణాకు ప్రయత్నిస్తే, వారిని చంపుతామని బెదిరించిన సంఘటనలు కూడా ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఇసుక అందుబాటులో ఉన్న గ్రామాల ప్రజలు కూడా పక్క ఊళ్ల నుంచి కొనుగోలు చేయాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

### అధికార యంత్రాంగం పట్టించుకోదా?

ఈ అక్రమ దందా వెనుక స్థానిక నాయకుల అండదండలు ఉండడంతో, పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మామూళ్ల మత్తులో ఉన్నారో లేక రాజకీయ ఒత్తిళ్లకు భయపడుతున్నారో తెలియదు కానీ, అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### నిబంధనలకు పాతర, నామమాత్రపు చర్యలు

ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు, ట్రక్కులకు నెంబర్ ప్లేట్లు, ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్ లేదా వాహన పత్రాలు వంటి ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. అయినప్పటికీ, అధికారులు అప్పుడప్పుడు ఒకటి రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేవలం 5,000 నుండి 15,000 వరకు చలానాలు రాసి పంపిస్తున్నారే తప్ప, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టలేకపోతున్నారు. సరైన తనిఖీ చేపడితే వందలాది వాహనాలను సీజ్ చేయగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ పథకాలను అడ్డం పెట్టుకుని, ప్రజా సంపదను అక్రమంగా దోచుకుంటూ, స్థానికులకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఇసుక మాఫియా ఆగడాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి ప్రజలు కోరుతున్నారు.




## ఏకగ్రీవం చేస్తే.. రూ.30 లక్షలిస్తా..!

**మధిర మండలంలోని రాయపట్నం సర్పంచ్ ఆశావహుడి ఆఫర్.**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తనను సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధికి రూ. 30 లక్షలు విరాళం ఇస్తానంటూ మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామానికి చెందిన సర్పంచిగా పోటీ చేయాలనుకున్న వ్యక్తి ఆఫర్ ప్రకటించాడు. రాయపట్నం గ్రామ పంచాయతీలో సుమారుగా 1800 మంది ఓటర్లు ఉండగా బీసీ జనరల్ గా రిజర్వేషన్ ఖరారైంది.. సర్పంచ్ గా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధికి రూ. 30 లక్షలు విరాళంగా ఇస్తానని గ్రామ అభివృద్ధిని అభివృద్ధి చేసి చూపిస్తానని రాయపట్నం గ్రామానికి చెందినయువ నాయకుడు తెలిపారు. మీడియా వేదికగా తెలియజేశాడు. అయితే గ్రామ ప్రజలు అందరూ కలిసి దీనిపై గ్రామస్తులు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి..



## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండించిన సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయి పై జరిగిన మతోన్మాద దాడిని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి, కూసుమంచి సబ్ డివిజన్ కార్యదర్శి ఐ. వెంకన్న మాట్లాడుతూ, దేశంలో మత ఉన్మాదం పెరిగిపోతోంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరిగే స్థితి రావడం అత్యంత ఆందోళనకరం" అని అన్నారు. మతం ముసుగులో రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు జరుగుతున్నాయని, బిజెపి పాలనలో ధనవంతులు మరింత ధనవంతులవుతూ, పేదలు మరింత దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరూ కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. జస్టిస్ గవాయి ధైర్యవంతమైన స్పందన ఇతర న్యాయమూర్తులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తిపై జరిగిన ఈ దాడిని తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కే. సురేష్, డివిజన్ నాయకులు మాతంగి రామస్వామి, చెరుకుపల్లి వీరయ్య, బుర్ర సైదులు, బత్తుల ఉప్పలయ్య, పోకల ఎంకన్న తదితరులు పాల్గొన్నారు.



## మా భూములను మమ్మల్ని సాగు చేయకుండా అడ్డుకుంటున్నారు.

**గిరిజన రైతుల ఆవేదన**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వారసత్వంగా తమకు సంక్రమించిన భూములలో సాగు చేయకుండా అడ్డుపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఈసాల కృష్ణయ్య కుటుంబ సభ్యులు మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ గో డును వెలిబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మా బంధువైన ఈసాల వెంకన్న మా సొంత భూములలో స్వతంత్రంగా వ్యవసాయం చేసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్న అతను మా భూములను బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఈనెల రెండవ తేదీన మా చేనులో గేదెలను మేపుతుండగా ఈసాల వెంకన్న, అతని కుమారుడు ఉదయ్, చిన్న కుమారుడు కలిసి కృష్ణయ్య, కోటమ్మ, రజితలపై విచక్షణ రహితంగా దాడి చేశారని విలపించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈసాల వెంకన్న అతని కుమారులతో మాకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులను వేడుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వారి బంధువులు చిరంజీవి, ఈసాల ఎర్రయ్య, విజయ, బాయమ్మ, ఉమా, రమా తదితరులు పాల్గొన్నారు.




## మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ఆశయాల సాధన దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహాకవి వాల్మీకి ఆధ్యాత్మికవేత్తగా రామాయణ కావ్యం రచించి ఆదికవిగా వెలుగొందారని, రామాయణం ద్వారా అనేక విలువలను సమాజానికి అందించారని అన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవుడికి ఉండవలసిన లక్షణాలు, మానవ సంబంధాలు, విలువలను మహాకవి మనందరికీ బోధించారని అన్నారు. ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని జరుపు కోవడం సంతోషకరమని తెలిపారు. అనంతరం వక్తలు మహర్షి వాల్మీకి జీవిత విశేషాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, కలెక్టరేట్ సిబ్బంది, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మధిర ఉత్తమ మున్సిపాలిటీలో చెత్త సమస్య

- టాక్సీలు వసూల్ ఫుల్.. అభివృద్ధి నిల్
- వార్డులన్నీ చెత్తమయం.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు
- మున్సిపాలిటీలో పారిశుధ్యం లోపించడం వల్ల పలు వార్డుల్లో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో గత కొన్ని వారాలుగా చెత్తను స్వీకరించబడడంతో వీధులన్నీ చెత్తమయంతో దుర్గంధ భరితంగా కంపు కొడుతున్నాయి. మున్సిపాలిటీలోని పలు వార్డులోని ప్రజలు పారిశుధ్యం లోపించడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.. ఒకటో వార్డు చెత్త నందు చెత్త డ్రైనేజీ సమస్య, పారిశుధ్యం లోపించడం వల్ల అనేకమంది డెంగ్యూతో బాధపడుతూ ఒకరిద్దరు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అటు వైద్య శాఖ నుండి తూతూ మంత్రంగా ఉచిత క్యాంపులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు మున్సిపాలిటీ అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడడం లేదు. మధిర పట్టణ నడిఒడ్డు రామనాథం గారి హాస్పిటల్ గర్ల్స్ హై స్కూల్ తదితర ప్రాంతాల్లో గత కొన్ని వారాలగా చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తీసివేయకపోవడం వల్ల వీధుల వెంట పేరుకుపోయి దుర్గంధ భరితంగా మారాయి. గర్ల్స్ హై స్కూల్ పాఠశాలలో విద్యార్థులు ఈ దుర్గంధ భరితమైన గాలిని పేల్చుకోవడం వల్ల అనారోగ్య పాలవుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మధిర మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికైనా స్పందించి మధిర మున్సిపాలిటీలో పలు వీధుల్లో పేరకపోయిన చెత్తను వెంటనే తొలగించే ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవలసిందిగా కోరుతున్నారు.



## లాభాల బాటలో సత్తుపల్లి ఆర్టీసీ

**ఒక్కరోజే రూ.38లక్షల ఆదాయం.**

**ఆర్టీసీ డీఎం ఊటుకూరి సునీత**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** దసరా పర్వదినం సందర్భంగా సత్తుపల్లి డిపోకు ఒక్కరోజు 6వ తేది సోమవారం రూ. 37,95,470 ఆదాయం వచ్చిందని డీఎం ఊటుకూరి సునీత మంగళవారం తెలిపారు. గతంలో రాఖీ రోజు రూ. 32లక్షలు, గతేడాది దసరా రోజు రూ. 34లక్షలు ఆదాయం రాగా ఈసారి అధిగమించామని చెప్పారు. 20 అదనపు సర్వీసులను నడిపించామని, ఆరోజు 1.6ఆక్యూపెన్సీ రేషియో సాధించామని, అదేవిధంగా 67.80 ఇపికె సాధించినట్లు పేర్కొన్నారు. 55,977 కిలోమీటర్లు మేర బస్సులు రాకపోకలు సాగించామన్నారు. ఇదంతా డిపో ఉద్యోగులు, సిబ్బంది సమష్టిగా, కలిసికట్టుగా పనిచేయడంతోనే సాధ్యమైందని, అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిపో గేట్ వద్ద ఉద్యోగుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ. విజయశ్రీ, ఎంఎఫ్ ఎస్. సాహితీ, ఏడీసీలు, సూపర్ వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగ విరుద్ధమైన చర్య

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి
- దళిత మేధావులపై దాడులు చేస్తే సహించం
- మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంగరెక్క సంజయ్




**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సనాతన ధర్మం పేరుతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. కెవిపిఎస్, మాల మహానాడు ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద దాడిని ఖండిస్తూ ప్లకార్డులతో నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సుప్రీంకోర్టులో ఖజురహోలోని విష్ణుమూర్తి విగ్రహం పై వచ్చిన పిటిషన్ విషయంలో ఆర్కియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా అనుమతితో విగ్రహ పునర్నిర్మాణం చేపట్టాలని వ్యాఖ్యానించిన చీఫ్ జస్టిస్ పై ఉద్దేశపూర్వకంగానే దాడికి పాల్పడ్డారని అన్నారు. సీనియర్ అడ్వకేట్ అయిన కిషోర్ ఆర్ఎస్ఎస్ ప్రోత్బలంతో సనాతన ధర్మాన్ని కి వత్తాసు పలకలేదని చీఫ్ జస్టిస్ పై ఈ ఘాతకానికి పూనుకున్నాడని తెలిపారు. దేశ న్యాయవ్యవస్థ చరిత్రలో ఏనాడు కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదని అన్నారు కేవలం దళితుడైన గవాయి చీఫ్ జస్టిస్ గా ఉండటంతో వారిని అవమానించడం కోసమే ఈ చర్యకు ఒడిగట్టారని అన్నారు. గతంలో చీఫ్ జస్టిస్ మహారాష్ట్ర పర్యటనలో కనీస ప్రోటోకాల్ కూడా అధికారులు పాటించలేదని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ పై ఇలాంటి చర్యకు పాల్పడటం అంటే రాజ్యాంగం మీదనే దాడి చేయడమని పేర్కొన్నారు. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చాక దళితులు, అభ్యుదయ వాదులు, మైనార్టీలు, మేధావులపై దేశంలో దాడులు పెరిగిపోయాయని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు చీఫ్ జస్టిస్ పై దాడికి పాల్పడ్డ కిషోర్ ను బార్ కౌన్సిలింగ్ నుండి సస్పెండ్ చేయడమే కాదు తన లా డిగ్రీ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పంగరెక్క సంజయ్ మాట్లాడుతూ దేశంలో దళిత మేధావుల పైన మతం పేరుతో కులం పేరుతో దాడులకు పాల్పడితే సహించబోమని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం అందరం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. చీఫ్ జస్టిస్ పై దాడి చేయడం అనైతిక చర్యా అని ఇలాంటి దాడులను అందరూ తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దేవరకొండ యాదగిరి మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ జంగం కరుణాకర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బోల్లెద్దు వినయ్, పిఎన్ఎమ్ జిల్లా అధ్యక్షులు బచ్చులకూరి రాంబాబు, మాల మహానాడు జేఏసీ జిల్లా కన్వీనర్ వీర్జాల వేణు బలరాం, మాల మహనాడు జిల్లా నాయకులు బోయల అఖిల్, కెవిపిఎస్ జిల్లా నాయకులు దేవరకొండ గిరి, నందిపాటి సతీష్, సూర్యతేజ, ఉదయ్ పాల్గొన్నారు.



## సీజేఐపై దాడికి నిరసనగా విధులు బాయ్ కాట్ చేసిన న్యాయవాదులు

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడి చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేయడమేనని చేవెళ్ల కోర్టు న్యాయవాదులు ఆరోపించారు. మంగళవారం చేవెళ్ల బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ముకురమ్ నర్సిములు ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి సందర్భంలోనూ సహించబోమని హెచ్చరించారు. సనాతన ధర్మం ముసుగులో రాజ్యాంగాన్ని అవమానించేలా, దేశ అత్యున్నత పదవుల్లో ఒకరైన సీజేఐపై షూతో దాడికి యత్నించడం దారుణమని మండిపడ్డారు. నిందితుడు న్యాయవాది రాకేష్ కిషోర్ మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను కాపాడటానికి ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టు బహిష్కరణలో చేవెళ్ల బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఈ రవీందర్ రెడ్డి, లైబ్రేరియన్ పి మల్లేష్, స్పోర్ట్స్ సెక్రటరీ ఏ ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ తలారి ప్రకాశం, ఈశ్వరయ్య, సీహెచ్ రవీందర్, ఎం శివరాజ్, ప్రదీప్ రెడ్డి, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కే కుమార్, న్యాయవాదులు బిర్ల వెంకటేశం, యాది రెడ్డి, ఎన్ చంద్ర శేఖర్, సురేష్, నాగి రెడ్డి, జైపాల్, తాజుద్దీన్, గౌతం రెడ్డి, రోజా రెడ్డి, విటలయ్య, రాజశేఖర్, గోపాల్ గౌడ్, శ్రీనివాస్, సుదర్శన్, ఆనంద్, మహేష్, సతీష్, లోకేశ్వరి, స్వప్న, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.



## వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టరెట్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించరు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ...మహర్షి వాల్మీకి మన దేశానికి ఆదర్శప్రాయమైన కవి, ఆధ్యాత్మిక గురువుగా నిలిచారు. ఆయన రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం, న్యాయం, నిష్కామ సేవ వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారు. ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డి ఆర్ ఓ మంగీ లాల్, బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు ఫ్రీ ఇచ్చి, మగవారి నుంచి డబుల్ చార్జీలు వసూలు

- పెంచిన బస్సు ఛార్జీలను వెంటనే తగ్గించాలి
- మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్టిసి) బస్సు టికెట్ ధరలను పెంచి, పేద ప్రజలు, విద్యార్థులపై భారం వేస్తారా అని చేవెళ్ల మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయన మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి సామాన్యుడిపై పెద్ద భారం మోపిందని ఆరోపించారు. ఒక్కో టికెట్‌పై సుమారు రూ. 10 పెంచి, నెలకు రూ. 500 నుంచి 600 రూపాయల అదనపు భారాన్ని సామాన్య ప్రజలపై మోపారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అన్ని రకాల ధరలను పెంచుతున్నారని విమర్శించారు. ఆర్టీసీ ఛార్జీలతో పాటు మొన్న వాహనాల రిజిస్ట్రేషన్ ఛార్జీలు, అంతకుముందు మద్యం ధరలు కూడా పెంచారని, ఈ విధంగా ఛార్జీలు పెంచి సామాన్యుల జీవితాన్ని నరకం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ... ఒక వైపు మహిళలకు ఉచిత సౌకర్యం%స్త్ర% అంటూనే, మరోవైపు మగవారిపై బస్సు ఛార్జీలు పెంచి, రెండు భారాలను సమానం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని హెద్దేవా చేశారు. సామాన్య ప్రజలకు నిజమైన ఊరట దక్కాలంటే మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందేనని అయన పేర్కొన్నారు.



## మహర్షి వాల్మీకి ఒక యుగపురుషుడు

### వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు ఎస్పీ కె.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి కేవలం ఒక కవి మాత్రమే కాదని, ఆయన ఒక యుగ పురుషుడని కొనియాడారు. ఆది కవిగా ప్రసిద్ధి చెందిన మహర్షి వాల్మీకి రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం కాదు అది సత్యం, నీతి, ధర్మం, కర్తవ్యం వంటి మానవ విలువలకు అద్దం పడుతుంది. ఈ పవిత్ర గ్రంథం అనాదిగా సమాజంలో సత్యం, న్యాయం, సమానత్వం స్థాపనకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపినారు. ప్రజలకు సేవ చేస్తూ బాధ్యతాయుతమైన జీవనం గడపడానికి, నిస్వార్థ సేవకు వాల్మీకి మహర్షి ఆశయాలే మనకు మార్గదర్శకమని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, ఏఓ ఖాజ ఖాయిమోద్దీన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ డి.వి.పి. రాజు, ఆర్ఐ లు డేవిడ్, అంజాత్ పాషా తో పాటు పలువురు ఎస్సైలు, పోలీసు సిబ్బంది, కార్యాలయ అధికారులు, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## చెరువులో 500 ఓటరు కార్డులు..

**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్‌లోని ఓ చెరువులో వందలాది ఓటరు కార్డులు పడి ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అసలేం జరిగిందంటే.. ఛతర్‌పుర్ జిల్లా బిజావర్‌లోని చెరువులో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు అక్కడికి వచ్చారు. ఈక్రమంలో చెరువులో సుమారు 500 ఓటరు కార్డులు ఉండటాన్ని గుర్తించారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్డులు ఓటర్లకు చేరకముందే మాయమై ఉండొచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు. ఇక, ఈ ఘటన స్థానికంగా రాజకీయ దుమారం రేపింది. ఓటరు కార్డులు చెరువులో ఉండటంపై అక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు . దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు దీప్తీపాండే విజ్ఞప్తి చేశారు. కార్డులను భద్రపరిచామని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు. ఇది నిర్లక్ష్యం కారణంగా జరిగిందా, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేసిందా అనే దానిపై విచారిస్తామన్నారు.

# ట్రంప్ ఇమిగ్రేషన్ పాలసీ

### భారీగా తగ్గిన భారత విద్యార్థి వీసాలు

**యూఎస్ :** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నతవిద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యూఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్ర దేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు.. చైనా విద్యార్థులకు యూఎస్ 86,647 వీసాలు జారీ




చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్య కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ ఏడాది మేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగును తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా.. లేదా అనే దాన్ని అంచనా వేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే 'సోషల్ మీడియా వెట్టింగ్' అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

## కరూర్ తొక్కిసలాట..

### బాధిత కుటుంబాలకు విజయ్ వీడియో కాల్

**కరూర్ :** టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈనేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన.. త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. మరోవైపు.. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవు తున్నాయి. "ఇలాంటి బాధాకరమైన పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇలాంటి సమయంలో నేను కరూర్‌కు వెళితే.. అసాధారణ



పరిస్థితులకు దారితీయొచ్చు. త్వరలోనే బాధిత కుటుంబాలను కలుస్తా" అని ఇటీవల వెల్లడించారు. కాగా.. కరూర్‌లో ఘటనాస్థలిని సోమవారం ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. తమిళగ వెట్రి కళగం(టీవీకే) సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## 40వేల 'చోరీ ఫోన్ల' స్మగ్లింగ్

### పట్టించిన ఐఫోన్



**లండన్ :** చోరీకి గురైన తన ఐఫోన్‌ను వెతికేందుకు బ్రిటన్‌లో ఓ వ్యక్తి చేసిన ప్రయత్నం.. అంతర్జాతీయ ముఠా గుట్టురట్టుకు దారితీసింది. తస్కరించిన దాదాపు 40 వేల ఫోన్లను ఈ గ్యాంగ్ బ్రిటన్ నుంచి చైనాకు అక్రమంగా రవాణా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లండన్‌లో మాయమైన ఫోన్లలో దాదాపు సగం వరకు ఈ ముఠానే తరలించి ఉండొచ్చని భావిస్తున్నారు. బ్రిటన్‌లో చరవాణుల చోరీకి సంబంధించి చేపట్టిన అతిపెద్ద ఆపరేషన్ ఇదేనని తెలిపారు. ఇందులో భాగంగా 18 మందిని అరెస్టు చేశామని, రెండు వేలకుపైగా చోరీ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. "గత ఏడాది క్రిస్మస్ సమయంలో లండన్‌లో ఓ వ్యక్తి ఐఫోన్ దొంగతనానికి గురైంది. అతడు దాన్ని ట్రాక్ చేయగా.. హీత్రో విమానాశ్రయానికి సమీపంలోని ఓ గోదాంలో ఉన్నట్లు గుర్తించాడు. అక్కడ తనిఖీలు నిర్వహించగా.. ఓ పెట్టెలో ఆ ఐఫోన్‌తోపాటు మరో 894 ఫోన్లు బయటపడ్డాయి" అని పోలీసులు తెలిపారు. దాదాపు అన్నీ కాజేసినవేనని, వాటిని హాంకాంగ్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే ఇద్దరు అఫ్గాన్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. వారి కారులో పదులకొద్దీ ఫోన్లు లభ్యమయ్యాయి. వారి ఇళ్ల వద్ద నిర్వహించిన తనిఖీల్లో మరో రెండు వేల చరవాణులు దొరికాయి. ఇప్పటివరకు మొత్తం 18 మందిని అరెస్టు చేయగా.. వారిలో ఒకరు మహిళ. ఆమె వద్ద 30 ఫోన్లు దొరికినట్లు చెప్పారు. లండన్‌లో గత నాలుగేళ్లలో ఫోన్ల చోరీలు దాదాపు మూడు రెట్లు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నగరాన్ని ఏటా రెండు కోట్ల మంది సందర్శిస్తుంటారు. వెస్ట్ ఎండ్, వెస్ట్‌మినిస్టర్ వంటి పర్యాటక ప్రదేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. దేశవిదేశాల్లో సెకండ్ హ్యాండ్ ఫోన్‌లకు పెరుగుతున్న డిమాండ్.. ఈ చోరీలకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. ప్రత్యేకించి ఆపిల్ ఉత్పత్తులను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు తెలిపారు. డబ్బుల ఆశతో కొంతమంది మాదకద్రవ్యాల అక్రమ రవాణా మానేసి.. ఈ దందా చేస్తున్నట్లు సమాచారం ఉందని మంత్రి సారా జోన్స్ తెలిపారు.

## రోడ్డు భద్రత మన అందరి బాధ్యత

### టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్, అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** శ్రీ కృష్ణ యూత్ ప్రజల ప్రాణ భద్రత కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని అన్నారు. శ్రీ కృష్ణ యూత్ వ్యవస్థాపకులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ మంగళవారం రోజున శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం మల్కం చెరువు వద్ద రోడ్డు భద్రతపై ప్రజా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామ రామ్మోహన్ రెడ్డి , టీపీసీసీ మీడియా %డ% కమ్యూనికేషన్స్ చైర్మన్, అధికార ప్రతినిధి), టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా డీసీసీ జనరల్ సెక్రటరీ అభిషేక్ గౌడ్, రోహిత్ గౌడ్, ట్రాఫిక్ డీసీపీ మాధాపూర్, ఏసీపీ మాధాపూర్, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు భారత్ గౌడ్, డీసీసీ సెక్రటరీ సురేష్ గౌడ్, శశాంక్ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాణభద్రత కోసం హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో ఆయన వివరించారు.






ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలనీ, రోడ్డు భద్రత చర్యలు ప్రాణాలను కాపాడటమే కాకుండా సామాజిక క్రమశిక్షణకు ప్రతీక అని తెలిపారు.

## ఆ దాడులు మాకు ముగింపు అనుకున్నారు

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు




**ఇజ్రాయెల్ :** ఇజ్రాయెల్- గాజా మధ్య యుద్ధానికి రెండేళ్లు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెత న్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. యు ద్ధం ఎక్కడ మొదలయ్యిందో.. అక్కడే ముగుస్తోందన్నారు. ఓ ఇంటర్వ్యూలో మా ట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాతో యుద్ధం ముగిం చడానికి దగ్గరగా ఉన్నామన్నారు. అయి నా.. హమాస్ ఇంకా నాశనం కాలేదని వ్యాఖ్యానించారు. గాజాలో ప్రారం భమైన యుద్ధం అక్కడే ముగుస్తోందన్నారు. అక్టోబరు 7న హమాస్ చేసిన దాడుల తో ఇజ్రాయెల్ పనైపోయిందని అందరూ భావించారన్నారు. కానీ, ఊహించని విధంగా ఇంకా బలపడిందని నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్ ఇంకా నాశనం కాలేదని, కానీ ఆ లక్ష్యాన్ని తాము త్వరలోనే చేరుకుంటామని నొక్కి చెప్పారు. అప్పుడు ఇజ్రాయెల్ మరింత బలమైన దేశంగా ఉద్భవిస్తుందని వెల్లడించారు. ఇక, ఇదే ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఉన్న సంబంధంపై కూడా నెతన్యాహు మాట్లాడారు. వాషింగ్టన్, న్యూయార్క్‌లను చేరుకునే ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని, అప్రమత్తంగా ఉండాలంటూ ట్రంప్‌ను హెచ్చరించారు. 'మామూలుగా ఒక దేశం తనకు తాను మొదట ప్రాధాన్యం ఇస్తుంది. అమెరికా ఫస్ట్ అంటే ఒక్క అమెరికానే ఉంటుందని కాదు.. గ్రేట్ పవర్స్‌కు మిత్ర దేశాలు కావాలి. ఇజ్రాయెల్ అనేది యుద్ధరంగంలో పోరాడుతోన్న ఒక మిత్ర దేశం' అని నెతన్యాహు అన్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడులకు పాల్పడింది. దీంతో ఇది యుద్ధానికి దారితీసింది. ఇప్పటివరకు టెల్అవీవ్ చేసిన ప్రతీకార దాడులకు గాజాలో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక నగరాలు ధ్వంసం అయ్యాయి. గాజా యుద్ధం ముగింపునకు ఇటీవల కీలక ముందడుగు పడింది. ట్రంప్ 20 పాయింట్లతో ప్రణాళికను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనికి ఇరుపక్షాలు అంగీకరించాయి. దీనిపై ఈజిప్టులో చర్చలు జరుగుతున్నాయి.



## ఘనంగా దుర్గామాత ఊరేగింపు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** మియాపూర్ డివిజన్ పరిధిలో హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న దుర్గాదేవి నిమజ్జనం వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హెచ్ఎంటి సాయిబాబా గుడి దగ్గర నుంచి అమ్మవారి ఊరేగింపు మొదలైంది. కాలనీ మొత్తం ఎంతో సంబరంగా డీజే పాటలతో నృత్యంతో ఎంతో భక్తి శ్రద్ధగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఇలా అహ్లాదరకంగా నిర్వహిస్తామని హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీ అసోసియేషన్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నలు, పెద్దలు, కాలనీవాసులు, భక్తులు భారీగా పాల్గొన్నారు.



## లింగంపల్లి రైల్వే స్టేషన్లో భారీగా గంజాయి పట్టివేత

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** గంజాయి అక్రమ రవాణా పై స్పెషల్ ఆపరేషన్ టిమ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతూ గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంటూనే ఉన్నారు అయితే తాజాగా చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని లింగంపల్లి రైల్వే స్టేషన్ లో మంగళవారం నాడు భారీగా గంజాయి పట్టుబడింది. ఇద్దరు మహిళల్ని ఒక పురుషుడిని అదుపులోకి తీసుకున్న చందానగర్ పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగంపల్లి రైల్వే స్టేషన్ లో విశాఖ పట్టణం నుండి ముంబయి కి రైలు మార్గంలో గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫామ్ నంబర్ ఒకటి లో ఇద్దరు మహిళల్ని ఒక పురుషుడిని అదుపులోకి తీసుకొని వారి వద్దనుండి 47 కిలోల గంజాయిని మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిందితుల్ని వారి వద్ద స్వాధీనం చేసుకున్న వస్తువులని స్థానిక చందానగర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

# లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. క్యూ2 ఫలితాల సీజన్ ప్రారంభం వేళ ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. ఈ కారణంగా సూచీలు స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 81,883.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,790.12) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,309.56 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో లాభాల స్వీకరణతో 136.63 పాయింట్ల లాభంతో 81,926.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 30.65 పాయింట్ల లాభపడి 25,108.30 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.78గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, టాటా మోటార్స్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.34 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3957 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.






## శుభ్‌మన్ గిల్ ఇప్పట్లో అన్ని ఫార్మాట్లకు కెప్టెన్ కాలేడు : ఉతప్ప

టెస్టులకు సారథిగా ఉన్న శుభ్‌మన్ గిల్ ఇటీవల వన్డేలకూ కెప్టెన్‌గా నియమితుడైన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మ స్థానంలో అతడిని కెప్టెన్‌గా చేశారు. ప్రస్తుతం టీ20లకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్‌కు త్వరలో నాయకత్వ పగ్గాలు అప్పగిస్తారనే చర్చ జరుగుతోంది. భారత మాజీ బ్యాటర్ రాబిన్ ఉతప్ప ఈ విషయంపై స్పందించాడు. రోహిత్ శర్మ నుంచి వన్డే కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించినప్పటికీ శుభ్‌మన్ గిల్ సమీప భవిష్యత్తులో భారత జట్టుకు అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా మారలేడని అభిప్రాయపడ్డాడు. గిల్ ఇంకా టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాల్సి ఉందన్నాడు. శ్రేయస్ అయ్యర్‌ను పొట్టి ఫార్మాట్ కెప్టెన్‌గా చేసే అవకాశాలను కొట్టిపారేయలేమని ఉతప్ప పేర్కొన్నాడు. 'టెస్ట్ క్రికెట్‌లో గిల్ మంచి ఆటగాడని నేను అనుకుంటున్నాను. వన్డేల్లోనూ అతని గణాంకాలు బాగున్నాయి. కానీ ఈ స్థాయి ఆటగాడికి మరింత మెరుగైన గణాంకాలు ఉండాలనుకుంటున్నా. సెలక్టర్లు టీ20లకు కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను పరిశీలిస్తారని భావిస్తున్నా. పొట్టి ఫార్మాట్‌లో గిల్ ఇంకా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేదు. ఆసియా కప్ 2025లో గిల్ బాగా ఆడకపోవడంతో రెండో ఓపెనింగ్ స్లాట్ కోసం సంజు శాంసన్, యశస్వి జైస్వాల్ మధ్య పోటీ నెలకొంది. గిల్ ముందు టీ20 జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవాలి. అతను కెప్టెన్ అవుతాడని నేనైతే అనుకోవట్లేదు. భారత క్రికెట్‌లో రాత్రికి రాత్రే పరిస్థితులు మారిపోతాయని మనకు తెలుసు. నిజాయితీగా చెప్పాలంటే భారత్‌లో వైస్ కెప్టెన్సీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. కొంతమంది వైస్ కెప్టెన్లు కెప్టెన్ కాకపోవడం చూశాం కదా?' అని రాబిన్ ఉతప్ప వ్యాఖ్యానించాడు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య మూడు వన్డేల సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్‌తోనే గిల్ వన్డే కెప్టెన్ పగ్గాలు స్వీకరించనున్నాడు.



## రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా?

### టీమ్ఇండియా మాజీ క్రికెటర్

టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈనేపథ్యంలో మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. దీనికి సంబంధించి బీసీసీ ఇటీవలే స్క్వాడ్‌ను ప్రకటించింది. అయితే వన్డే జట్టులో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చోటు కల్పించలేదు. అటు బ్యాట్‌తోనూ, ఇటు బంతితోనూ అద్భుతంగా రాణిస్తున్న రవీంద్ర జడేజాను ఎంపిక చేయకపోవడాన్ని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సడగోపన్ రమేశ్ తప్పుబట్టాడు. అతన్ని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ అదనపు లగేజీగా చూస్తున్నారా.. అంటూ ప్రశ్నించాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీకి మేం అదనపు స్పిన్నర్లను తీసుకున్నాం.. కాబట్టి జడేజా టీమ్‌లో ఉన్నాడని సెలక్టర్ అగార్కర్ చెబుతున్నారు. అంటే రవీంద్ర జడేజాను అదనపు లగేజీగా చూస్తున్నారా? అతడో వైట్‌బాల్ లెజెండ్. మీకు అదనపు స్పిన్నర్లు అవసరమైతేనే అతన్ని జట్టులోకి తీసుకుంటారా? శుభ్‌మన్ గిల్‌ను టీ20 జట్టుకు వైస్ కెప్టెన్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా చేయడానికి మీరిచ్చిన సమాధానం.. అతడు ఇంగ్లాండ్ టూర్‌లో రాణించాడని. ఆ పర్యటనలో రవీంద్ర జడేజా కూడా అద్భుతమైన ప్రదర్శనలే చేశాడు' అని సడగోపన్ రమేశ్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా ప్రశ్నలు సంధించాడు. 'మీరు ధ్రువ్ జురేల్‌ను వెస్టిండీస్‌తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ చేశాడని ఎంపిక చేశారు. జడేజా అదే మ్యాచ్‌లో శతకం కొట్టడంతో పాటు, బౌలింగ్‌లో నాలుగు వికెట్లు కూడా తీశాడు. అయితే సెలక్టర్లు ధ్రువ్ జురేల్, శుభ్‌మన్ గిల్‌ను గుర్తించారు. జడేజాకేమో గుడ్‌బై చెప్పారు' అంటూ అతడు చురకలంటించాడు. 'ప్రస్తుతానికి ఇద్దరు ఎడమచేతి వాటం స్పిన్నర్లను ఆస్ట్రేలియాకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. జడేజా సమర్థుడే. బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్ అద్భుతంగా చేస్తాడు. అతను ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో ఉన్నాడు. ఎందుకంటే అక్కడి పరిస్థితుల కారణంగా మేము ఆ అదనపు స్పిన్నర్లను తీసుకున్నాం. ఇప్పుడు మేము ఒకరికే అవకాశం ఇవ్వగలం. వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్‌లతో జట్టులో సమతుల్యతను కాపాడుకోగలం. ఆస్ట్రేలియాలో మనకు అంతకంటే ఎక్కువ అవసరం ఉంటుందని నేను అనుకోను. ఇది కేవలం మూడు మ్యాచ్‌ల చిన్న సిరీస్. అందరికీ అవకాశం ఇవ్వలేము. దురదృష్టవశాత్తూ ఈసారి జడేజా మిస్ అవుతున్నాడు. కానీ అది అంతకుమించి ఏమీ కాదు' అని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్.. ఆసీస్‌తో వన్డే, టీ20 మ్యాచ్‌లకు భారత స్క్వాడ్‌ను ప్రకటించిన అనంతరం వివరించాడు.

## రో- కోను వన్డే వరల్డ్ కప్‌లో ఆడించకపోతే

# అది పెద్ద తప్పిదమే

### టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ



టీమ్ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని.. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వన్డే వరల్డ్ కప్ 2027లో ఆడించాలి. లేకపోతే అది పెద్ద తప్పిదమే అవుతుందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. అలాగే గౌతమ్ గంభీర్ కోచ్‌గా వచ్చినప్పటి నుంచే జట్టుకు సీనియర్ ఆటగాళ్లు దూరమవుతున్నారన్నాడు. తన నిర్ణయాలకు అడ్డు లేకుండా ఉండటం కోసమే గౌతమ్ గంభీర్.. అశ్విన్, రోహిత్, విరాట్‌ను జట్టులో లేకుండా చేశాడని మనోజ్ తివారీ సంచలన ఆరోపణలు చేశాడు. గత సంవత్సరం భారత్, ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. అలాగే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. మే 2025లో ఒకరి తర్వాత మరొకరు కొన్ని రోజుల వ్యవధిలో టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. వీరిద్దరూ ఇంతకుముందే టీ20లకు రిటైర్మెంట్ ఇచ్చారు. ప్రస్తుతం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. 'ఒకవేళ జట్టులో సీనియర్ ఆటగాళ్లైన అశ్విన్, రోహిత్, విరాట్ కోహ్లీ ఉంటే.. కోచ్‌గా గౌతమ్ గంభీర్ తీసుకున్న ఏదైనా నిర్ణయాన్ని తమకు నచ్చకుంటే వారు ప్రశ్నించే అవకాశం ఉంది. వారు లేకుంటే ఈ సమస్యే రాదుగా. గౌతమ్ గంభీర్ హెడ్‌కోచ్‌గా వచ్చినప్పటినుంచి చాలా వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది భారత క్రికెట్‌కు అంత మంచిది కాదు. గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాతే అశ్విన్, రోహిత్, విరాట్ తమ రిటైర్మెంట్లు ప్రకటించారు. ఊహించనివిధంగా పలువురు ఆటగాళ్లు స్క్వాడ్‌లోకి, తర్వాత నేరుగా తుది జట్టులోకి వస్తున్నారు' అని మనోజ్ తివారీ ఆరోపించాడు. 'రోహిత్, విరాట్ కోహ్లీ జట్టు కోసం ఎంతో చేశారు. కానీ ప్రస్తుతం వారిని ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఒకవేళ వారిద్దరినీ వన్డే వరల్డ్ కప్ 2027లో కోచ్ గౌతమ్ గంభీర్ ఆడించకుంటే.. అది పెద్ద తప్పిదమే అవుతుంది. తమ గౌరవానికి భంగం కలుగుతోందని భావిస్తే రోహిత్, విరాట్.. డ్రెస్సింగ్ రూంలో ఉండటానికి ఇష్టపడరు. బహుశా వారు రిటైర్ కావొచ్చు. కానీ అలా జరగొద్దని, వారు ఇంకా ఆడాలని నేను కోరుకుంటున్నా. గౌతమ్ గంభీర్ కూడా ఈ విషయంలో వెనకడుగు వేస్తాడు. ఎందుకంటే వైట్ బాల్ క్రికెట్‌లో రో-కో అద్భుతమైన ఆటగాళ్లు' అని మనోజ్ తివారీ విశ్లేషించాడు.

## శ్రేయస్ అయ్యర్ విషయంలో

# సంతోషంగా ఉన్నా : హర్భజన్ సింగ్



టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అందులో భాగంగా ఆసీస్‌తో మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. దీనికి సంబంధించి ఇటీవలే బీసీసీఐ.. స్క్వాడ్‌ను ప్రకటించింది. రోహిత్ శర్మను వన్డే కెప్టెన్‌గా తప్పించిన సెలక్టర్లు, శుభ్‌మన్ గిల్‌ను నూతన సారథిగా నియమించారు. అలాగే శ్రేయస్ అయ్యర్‌కు వన్డే జట్టులో చోటు కల్పించడంతోపాటు ఏకంగా వైస్ కెప్టెన్‌ను చేశారు. ఈ నిర్ణయాన్ని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ స్వాగతించాడు. నిలకడగా రాణించే ఆటగాళ్లలో శ్రేయస్ అయ్యర్ ఒకరు. కానీ.. చాలా అరుదుగా ప్రతిఫలం పొందుతాడని హర్భజన్ పేర్కొన్నాడు. 'శ్రేయస్ అయ్యర్ విషయంలో నేను సంతోషంగా ఉన్నాను. అత్యంత అరుదుగా క్రెడిట్ పొందే వాళ్లలో అతడు ఒకడు. నిజానికి టీమ్ఇండియా వన్డే జట్టులో ఆడేందుకు అతడికి పూర్తి అర్హత ఉంది. స్వదేశంలో జరిగిన గత వరల్డ్ కప్‌లో అతడు వరుస సెంచరీలతో ఆకట్టుకున్నాడు. అయ్యర్ ప్రభావవంతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లో ఉన్నప్పుడు జట్టులోని ఇతర ఆటగాళ్ల పని తేలిక చేస్తాడు. తిరిగి టీమ్‌లోకి కేవలం సభ్యుడిగానే కాకుండా.. వైస్ కెప్టెన్‌గా పునరాగమనం చేస్తున్నందుకు నేను ఎంతో సంతోషంగా ఉన్నా. అతడు శుభ్‌మన్ గిల్‌తో కలిసి టీమ్ఇండియాను ఎలా ముందుకు తీసుకువెళతాడో చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అని హర్భజన్ సింగ్ వివరించాడు. అయ్యర్ ఇప్పటి వరకు టీమ్ఇండియా తరఫున 70 వన్డేల్లో 2,845 పరుగులు సాధించాడు. ఇందులో 5 సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలున్నాయి. 128 ఈ ఫార్మాట్లో అతడికి అత్యధిక వ్యక్తిగత స్కోర్. అలాగే 14 టెస్ట్ మ్యాచుల్లో 811 పరుగులు చేశాడు. ఇందులో 1 సెంచరీ, 5 హాఫ్ సెంచరీలున్నాయి. 51 టీ20ల్లో 1,104 పరుగులు చేశాడు. ఇందులో 8 హాఫ్ సెంచరీలున్నాయి. ఈ ఫార్మాట్లో 74 అత్యధిక వ్యక్తిగత స్కోర్.

## ఆస్ట్రేలియా స్క్వాడ్ ప్రకటన.. కెప్టెన్ మిచ్ మార్ష్



టీమ్ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులోభాగంగా ఇరు జట్లు మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనున్నాయి. టీ20 మ్యాచ్‌లు అక్టోబర్ 29 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి టీమ్ఇండియా స్క్వాడ్‌ను ఇదివరకే బీసీసీఐ ప్రకటించింది. తాజాగా తమ వన్డే, టీ20 స్క్వాడ్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది.

**వన్డే జట్టు:** మిచ్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బ్రాట్‌లెట్, అలెక్స్ కేరీ, కూపర్ కానెల్లీ, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ రెన్‌షా, మ్యాట్ షార్ట్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా

**టీ 20 జట్టు:** మిచ్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబోట్, జేవియర్ బ్రాట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచెల్ ఓవెన్, మ్యాట్ షార్ట్, మార్కస్ స్టాయినిస్, ఆడం జంపా

గాయం వల్ల పాట్‌కమిన్స్ ఈ సిరీస్‌లో ఆడటం లేదు. ఇటీవల నెట్స్‌లో గాయపడిన మ్యాక్స్‌వెల్ కూడా అందుబాటులో లేడు. అతడు బిగ్ బాష్ లీగ్‌తో పునరాగమనం చేసే అవకాశం ఉంది. అలాగే ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ 2023 నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన లబుషేన్‌ను జట్టు నుంచి తప్పించారు. అతడు ఫామ్‌లో లేకపోవడమే దీనికి కారణం.



## రూ.7,499కే మోటోరొలా నుంచి కొత్త ఫోన్

ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ మోటోరొలా దేశీయ మార్కెట్లోకి కొత్త మొబైల్‌ను విడుదల చేసింది. మోటోరొలా జీ06 పవర్ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ కెమెరాతో ఈ ఫోన్‌ను తీసుకొచ్చింది. ఎంట్రీ లెవల్ ఫోన్స్ కోసం చూస్తున్న వారికి ఇదో ఆప్షన్ అవుతుంది. దీని ధరను రూ.7,499గా పేర్కొంది. 4జీబీ+64జీబీ సింగిల్ వేరియంట్‌లో అందుబాటు ఉంది. మోటోరొలా అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్, రిటైల్ స్టోర్లలో అక్టోబర్ 11 నుంచి ఈ ఫోన్‌ను కొనుగోలు చేయొచ్చు. మోటోరొలా జీ06 పవర్‌లో 6.88 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 డిస్‌ప్లే ప్రొటెక్షన్‌తో వస్తోంది. 120 రిఫ్రెష్‌రేటు, 600 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. దీంట్లో మీడియాటెక్ హీలియో జీ81 ఎక్స్‌ట్రీమ్ ప్రాసెసర్ అమర్చారు. ఫోన్ వెనక భాగంలో 50 ఎంపీ ప్రధాన రేర్ కెమెరా ఇచ్చారు. 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 7,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 18 ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇది పెంటోన్ లారెల్ ఓక్, పెంటోన్ టెండ్రిల్, పెంటోన్ టేప్‌స్ట్రీ కలర్స్‌లో లభిస్తుంది.





## యూపీఐ పిన్ అక్కర్లేదిక..

### ఫేస్, ఫింగర్‌ప్రింట్‌తోనే పేమెంట్స్

డిజిటల్ చెల్లింపుల స్వరూపాన్నే మార్చేసిన యూపీఐలో కీలక మార్పు రాబోతోంది. పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే చెల్లింపులు చేయగలిగే కొత్త వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఫేస్ రికగ్నిషన్, ఫింగర్ ప్రింట్ సాయంతో లావాదేవీలు చేసే సదుపాయానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అక్టోబర్ 8న శ్రీకారం చుట్టనుందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'రాయిటర్స్' కథనం వెలువరించింది. ముంబయిలో జరుగుతున్న ఫిన్‌టెక్ ఫెస్టివల్ వేదికగా దీన్ని ఆవిష్కరించనుందని తెలిపింది. యూపీఐ చెల్లింపులకు పిన్‌తో పాటు ప్రత్యామ్నాయ విధానాలు కూడా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించింది. ప్రస్తుతం ఎంటర్ చేస్తున్న 4/6 అంకెల పిన్ స్థానంలో ఇతర ఆప్షన్లు కూడా ఉండాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో బయోమెట్రిక్ వివరాలతో పేమెంట్స్ చేసే సదుపాయం తీసుకురావంపై ఎన్‌పీసీఐ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉడాయ్ డేటాబేస్‌లో ఉన్న ఆధార్ బయోమెట్రిక్ వివరాలను చెల్లింపుల కోసం వినియోగించుకోనుంది. దీనిపై ఎన్‌పీసీఐ ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఒకవేళ బయోమెట్రిక్ చెల్లింపుల వ్యవస్థ అందుబాటులోకి వస్తే పిన్‌కు ప్రత్యామ్నాయంగా మారడంతో పాటు డిజిటల్ పేమెంట్స్‌లో గణనీయమైన మార్పులు రానున్నాయి.

## ఫోన్ పక్కనపెట్టేసి.. 12 గంటలు నిద్ర

### : టెలిగ్రామ్ సీఈఓ సక్సెస్ మంత్ర ఇదే..



ఫోన్‌ను పక్కనపెట్టేసి హాయిగా నిద్రపోవడం తన విజయానికి సూత్రమని ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ వెల్లడించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ తాను రోజూ చేసే పనుల గురించి మాట్లాడారు. "నిద్రకోసం వీలైనంత ఎక్కువ సమయం కేటాయించడానికి ప్రయత్నిస్తాను. 11-12 గంటలు కేటాయిస్తే.. అన్ని గంటలు నిద్రపోతానని కాదు. బెడ్ మీద పడుకొని ఆలోచిస్తుంటాను. ఆ సమయం నాకెంతో ఇష్టం. అప్పుడు మంచి ఆలోచనలు వస్తుంటాయి" అని దురోవ్ అన్నారు. ఆయన పనిచేసేది సోషల్ నెట్‌వర్కింగ్ రంగంలో అయినా.. ఫోన్ ఎక్కువగా వినియోగించకపోవడం గమనార్హం. "నిద్రలేవగానే ఫోన్ చూడకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాను. ఆ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా మన రోజును డిసైడ్ చేసే అవకాశం ఉంటుందని నా అభిప్రాయం. నా జీవితంలో ఏది ముఖ్యమో నేను నిర్ణయించుకోవాలి.. ఇతర వ్యక్తులు, సంస్థలు కాదు. ఫోన్ లేకుండా ఉదయం వ్యాయామం చేస్తున్నప్పుడు, ఉదయం పూట రోజువారీ పనులు చేస్తున్నప్పుడు అందమైన ఆలోచనలు వస్తాయి" అని దురోవ్ వెల్లడించారు. ప్రపంచంతో సంబంధాలకు తాను విలువ ఇస్తానని అయితే అతి అనేది ఉత్పాదకతను దెబ్బతీస్తుందన్నారు. అలాగే డేటా గోప్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తానని గతంలో వెల్లడించారు. టెక్నాలజీ, కనెక్టివిటీకి మద్దతు ఇస్తున్నప్పటికీ.. జీవితంలో ఏది ముఖ్యమో అది చేయడానికి సమయానికి వెచ్చించాలని ఆయన సూచించారు. దురోవ్ గతంలో వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. 15 ఏళ్ల పాటు తాను చేసిన వీర్యదానంతో ప్రపంచవ్యాప్తంగా 12 దేశాల్లో 100 మంది పిల్లలు జన్మించారని, వారికి తన సంపదను పంచేస్తానంటూ ప్రకటించారు. దాదాపు 20 బిలియన్ డాలర్ల తన సంపదను వీరందరికీ సమానంగా పంచుతానని తన వీలునామాలో పేర్కొన్నట్లు తెలిపారు. ఎంతోమంది శత్రువులు ఉండటంతో 40 ఏళ్ల వయసులోనే వీలునామా రాయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. టెలిగ్రామ్ ద్వారా హవాలా మోసం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారం షేర్ చేయడం వంటి ఆరోపణలపై గతంలో ఆయన అరెస్టయిన సంగతి తెలిసిందే.

## మళ్లీ పెరిగిన బంగారం ధర



**హైదరాబాద్:** బంగారం ధర మళ్లీ పెరిగింది. మంగళవారం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,23,850కి చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,11,500గా ఉంది. వెండి కిలో రూ.1,54,350కి చేరింది. సోమవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,23,460 ఉండగా.. మంగళవారం మరో రూ.390 పెరిగింది. కిలో వెండి ధర రూ.1,54,200 ఉండగా.. తాజాగా మరో రూ.150 పెరిగి రూ.1,54,350కి చేరింది. అమెరికా షట్‌డౌన్ కొనసాగడం, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ఈ ఏడాదిలో మరింత తగ్గిస్తుందనే అంచనాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు తమ నిధులను బంగారం, వెండిపైకి మళ్లించడం ఈ పరిస్థితికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు.



# రిషబ్ మ్యాజిక్ చేశారు : క్రికెటర్ రాహుల్

## కాంతారా మూవీకి ఫిదా

రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కాంతార చాప్టర్ 1 దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ (ఫిదా అయ్యారు. తన ఇన్‌స్టా స్టోరీలో దీనిపై పోస్ట్ పెట్టారు. కాంతార చాప్టర్ 1 చూశాను. మరోసారి రిషబ్ తన ప్రతిభతో మేజిక్ చేశారు. మంగుళూరు ప్రజల నమ్మకాన్ని తెరపై అద్భుతంగా చూపించారని కేఎల్ రాహుల్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌కు కాంతార టీమ్ స్పందించింది. ఇది చూశాక ఎంతో గర్వంగా ఉందని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇది టీమ్ అందరికీ నిజంగా విన్నింగ్ మూమెంట్ అని పేర్కొంది. కేఎల్ రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపింది. కేఎల్ రాహుల్ తనకు కాంతార సినిమా అంటే ఎంతో ఇష్టమని ఇటీవల చెప్పిన విషయం తెలిసిందే. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించిన తర్వాత రాహుల్ చేసుకున్న సెలబ్రేషన్స్ నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై కేఎల్ స్పందిస్తూ.. మ్యాచ్ గెలిచాక సెలబ్రేషన్స్ నా ఫేవరెట్ సినిమాల్లో ఒకటైన కాంతార స్ఫూర్తితో చేశాను. నేను ఇక్కడ ఆడుతూ పెరిగాను అని చెప్పడం నా సెలబ్రేషన్స్ ఉద్దేశం అని తెలిపారు.



## రతితో ప్రేమలో పడేందుకు సిద్ధంగా ఉండండి.. : రుహాని శర్మ

యంగ్ హీరో కవిన్ విభిన్న కథలు ఎంచుకుంటూ వరుస సినిమాలు అనౌన్స్ చేస్తున్నాడు. ఇటీవల 'కిస్' అంటూ లవ్ చిత్రంతో వచ్చి ప్రేక్షకులను అలరించాడు. కానీ హిట్ అందుకోలేకపోయాడు. ప్రస్తుతం కవిన్ 'మాస్క్' మూవీ పనులో ఫుల్ బిజీ అయిపోయాడు. ఈ సినిమాకు వి.కర్ణన్ అశోక్ దర్శకత్వం వహిస్తున్నారు. గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ, బ్లాక్ మద్రాస్ ఫిలిమ్స్ బ్యానర్స్‌పై ఎస్పీ చొక్కలింగం, వెట్రిమారన్ నిర్మిస్తున్నారు. ఇందులో కవిన్ సరసన ఆండ్రియా జెరెమియా, రుహాని శర్మ హీరోయిన్లుగా నటిస్తుండగా.. కార్లీ, బాల శరవణన్, విజె అర్చన చందోక్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న 'మాస్క్' అక్టోబర్ 31నథియేటర్స్‌లో విడుదల కానుంది. దీంతో చిత్ర బృందం మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్‌ను విజయ్ సేతుపతి చేతుల మీదుగా లాంచ్ చేయించారు. ఈ విషయాన్ని తెలుపుతూ రుహాని శర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టింది. "రతి ప్రపంచంలోకి అనుమతిస్తున్నాను. హృదయం నుంచి నేరుగా ఒక భాగం. ఆమెను కలవడానికి, అనుభూతి చెందడానికి సిద్ధంగా ఉండండి. మీరు రతితో ప్రేమలో పడటాన్ని చూసేందుకు నేను వేచి ఉండలేకపోతున్నాను" అనే క్యాప్షన్ జత చేసింది. రుహానీ శర్మ కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇస్తుండటంపై.. వెల్‌కమ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## జ్యువెలరీ యాడ్ ఫిల్మ్‌లో బాలయ్య కూతురు తేజస్విని

టాలీవుడ్ లో స్టార్ హీరోల కొడుకులు హీరోలుగా వెండితెరపై ఎంట్రీ ఇస్తారు కానీ వారి డాటర్స్ మాత్రం స్క్రీన్ పై కనిపించడం అరుదు. గతంలో సూపర్ స్టార్ కృష్ణ కూతరు మంజుల హీరోయిన్ గా బాలయ్య సరసన చేయబోతోంది అంటే ఫ్యాన్స్ చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. అందుకే చాలా వరకు హీరోల డాటర్స్ స్క్రీన్ పై కనిపించేందుకు ఇష్టపడరు. ప్రస్తుతం స్టార్ హీరోలైన చిరు, బాలయ్య డాటర్స్ నిర్మాతలుగా రాణిస్తున్నారు. వెంకీ డాటర్స్ సినిమాలు దూరంగా ఇతర రంగాలలో రాణిస్తున్నారు. కానీ బాలయ్య చిన్న కూతురు నందమూరి తేజశ్వని ఇప్పుడు కెమెరా ముందుకు వస్తోంది. ప్రస్తుతం అఖండ 2 కు సహ నిర్మాతగా కూడా తేజు వ్యవహరిస్తోంది. ఇన్నిరోజులు తండ్రి బాలయ్య సినిమాల వ్యవహారాలు చూస్తూ వస్తున్న తేజు ఇప్పుడు కేమెరా ముందు నటించింది. హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్‌కు నందమూరి తేజస్విని బ్రాండ్ అంబాసిడర్ గా వ్యహరిస్తోంది. ఇటీవలే హైదరాబాద్‌లో ఈ యాడ్ షూట్ కూడా ఫినిష్ చేసారు తేజస్విని. ఈ జ్యువెలరీ బ్రాండ్ మరియు ఇతర ప్రమోషన్స్ గురించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.




## కమల్, రజనీ మల్టీస్టారర్ మూవీ

### తాను దర్శకత్వం వహించడం లేదన్న ప్రదీప్ రంగనాథ్

అగ్ర కథానాయకులు రజనీకాంత్, కమల్‌హాసన్ 46 ఏళ్ల తర్వాత కలిసి స్క్రీన్ పంచుకోనున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ అధికారికమైనప్పటినుంచి దీనికి సంబంధించిన అనేక వార్తలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కోలీవుడ్ దర్శకుడు ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా దీనిపై ఆయన స్పందిస్తూ... తాను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదని తెలిపారు. ఆ సినిమాకు నాకు దర్శకత్వం ఆఫర్ వచ్చిందో, లేదో కూడా నేను చెప్పను. కానీ, నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కాదు. ఎందుకంటే ప్రస్తుతం దర్శకత్వం మీద కంటే యాక్టింగ్ మీదే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాను. కమల్‌రజనీకాంత్ మల్టీస్టారర్ గురించి ఇంతకంటే ఏం చెప్పలేనని అన్నారు. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని. ఇప్పటివరకూ విడుదలైన ఆయన సినిమాలు మొదటిరోజు మొదటి ఆట చూశాను. డ్రాగన్ విడుదలయ్యాక ఆయన నన్ను ప్రశంసించారు. ఆ మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని ప్రదీప్ తెలిపారు. ఇటీవల జరిగిన సైమా అవార్డుల వేడుకలో కమల్‌హాసన్ ఈ మల్టీస్టారర్ గురించి అధికారికంగా వెల్లడించారు. మీరు, రజనీకాంత్ కాంబినేషన్‌లో ఓ సినిమాను ఆశించవచ్చా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికర సమాధానమిచ్చారు. ప్రేక్షకులు మా కాంబినేషన్‌ను ఇష్టపడితే మంచిదే కదా.. వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలిసి నటించాలని ఎన్నోఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాం. కానీ, ఇన్ని రోజులు అది కుదర్లేదు. త్వరలోనే మీ ముందుకు కలిసిరానున్నాం. అది మిమ్మల్ని సర్‌ప్రైజ్ చేస్తుందని స్పష్టంచేశారు. దీంతో ఈ బిగ్ మల్టీస్టారర్ అధికారికమైంది.



## కార్తికేయ తొలిహీరో..అల్లరి నరేశ్



మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన కార్తికేయ చిత్రం కోసం తొలుత అల్లరి నరేశ్‌ను అడిగారట. ఆయనను ఉద్దేశించి కథను సిద్దం చేసుకున్నట్లు చందు మొండేటి తెలిపారు. ఈ సినిమా నిఖిల్ చేయగా టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేసింది. హీరో నిఖిల్ కెరీర్‌లో బి÷గగెస్ట్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. సుమారు రూ.6 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లు వసూళ్లు సాధించింది. ముందుగా ఈ కథను దర్శకుడు చందూ మొండేటి.. నరేశ్‌కే వినిపించారు. స్టోరీ తనకు బాగా నచ్చినా ఒక్క కారణంతో ఆయన ఈ చిత్రంలో నటించేందుకు అంగీకరించలేదు. అదేంటంటే.. సుబ్రహ్మణ్యపురం అనే గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో పాములు ఎక్కువగా కనిపించిన సంగతి తెలిసిందే. ఆ సన్నివేశాలే ఈ సినిమాకి కీలకం. వ్యక్తిగతంగా తనకు పాములంటే భయపడడం వల్ల నరేశ్ ఆ సినిమాని తిరస్కరించారట. ఓ ఇంటర్వ్యూలో ఆయనే ఈ వివరాలు పంచుకున్నారు. బయటేకాదు సినిమాల్లో కనిపించే పాముల దృశ్యాలను చూసినా ఇప్పటికీ భయపడతానన్నారు. ఈ సినిమాకి సీక్వెల్‌గా కార్తికేయ 2 రూపొందింది. కార్తికేయ పార్ట్ 2 నిఖిల్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చింది. ఒకవేళ అల్లరి నరేశ్ కార్తికేయలో నటించి ఉంటే అప్పటి నుంచే ఆయన సీరియస్ కథల్లో కనిపించేవారేమో. సీరియస్ లుక్‌లో ప్రేక్షకులు తనని అంగీకరిస్తారా, లేదా? అనే సందేహానికి మహర్షి చిత్రంలో పోషించిన రవిశంకర్ పాత్ర జవాబుగా నిలిచిందని, ఆ క్యారెక్టరే పవర్‌ఫుల్ స్టోరీల్లో నటించేందుకు ధైర్యాన్నిచ్చిందని నరేశ్ మరో సందర్భంలోనూ పంచుకున్నారు. వరుసగా యాక్షన్ తరహా స్జబెక్ట్‌లకే పరిమితం కాకుండా కామెడీ సినిమాలూ చేస్తుంటానని చెప్పారు.



## అప్పుడే ఓటిటిలోకి ఇడ్లీ కొట్టు

తమిళ స్టార్ హీరో ధనుష్ ఇటీవల ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా తెలుగులో ఇడ్లీ కొట్టు. అక్టోబర్ 1న దసరా కానుకగా విడుదలైన ఈ సినిమా మొదటి షో నుంచే థియేటర్లలో మంచి హిట్ టాక్ దక్కించుకుంది. విమర్శకుల ప్రశంసలు, ప్రేక్షకుల ఆదరణ రెండింటిని సొంతం చేసుకుంది. ఇక తాజాగా ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు టాక్ నడుస్తోంది. రిలీజ్ అయిన నెల రోజుల్లోపే డిజిటల్ ప్రీమియర్‌కి వస్తుందన్న వార్త ఫ్యాన్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం, ఇడ్లీ కడై ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకొగా. ఈ సినిమా అక్టోబర్ 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుందని టాక్ వినిపిస్తోంది. అంటే, థియేటర్లలో ఇంకా రన్ అవుతున్నప్పుడే డిజిటల్ ఎ÷లాట్‌ఫార్మ్‌కి రావడం పెద్ద సర్ప్రైజ్. ఇక ధనుష్ కేవలం హీరోగానే కాకుండా రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్‌గా కూడా పనిచేయడం ఈ మూవీకి మరింత హైప్ తెచ్చింది. అరుణ్ విజయ్, సత్యరాజ్, సముద్రఖని, నిత్యా మీనన్, షాలిని పాండే వంటి స్టార్స్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. గ్రామీణ నేపథ్యంలో నడిచే ఈ కథలో ధనుష్ మురుగన్ పాత్రలో కనిపిస్తాడు. కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడం, ఆధునిక ఆశయాలను నెరవేర్చుకోవడం మధ్య కన్‌ఫ్యూజ్ అయ్యే యువకుడి ఎమోషనల్ జర్నీని ఈ సినిమా చూపిస్తుంది. చివరికి తన మూలాలను తిరిగి చేరుకునే మురుగన్ పాత్రలో ధనుష్ నేచురల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. తిరుచిత్రంబలం తర్వాత నిత్యా మీనన్‌తో ఆయన జోడీ ఈ సినిమాకు మరో హైలైట్. జివి ప్రకాష్ మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. మొత్తంగా, థియేటర్లలో బజ్ క్రియేట్ చేసిన ఇడ్లీ కడై ఇప్పుడు ఓటీటీ లోనూ అదే మంత్రాన్ని కొనసాగించనుంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com